



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 02, పేజీలు - 08

శుక్రవారం, జూన్ 26, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD






# నేను గుంపు మేస్త్రినే

## రవీంద్రభారతిలో ఉద్యోగులకు సీఎం భారీ భరోసా

- 14 బ్యాంకులతో తెలంగాణ ప్రభుత్వం ఎంఓయూలు - కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా వర్తింపు
- ప్రమాద బీమా కవరేజీ రూ.1 కోటి నుంచి రూ.1.5 కోట్లు - విమాన ప్రమాద బీమా రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు
- పీఆర్సీ హామీని తప్పకుండా అమలు చేస్తామని సీఎం స్పష్టం






**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సమగ్ర ఉచిత ఇన్సూరెన్స్ కవరేజ్ ఒప్పంద కార్యక్రమం హైదరాబాద్‌లో అత్యంత ఘనంగా జరిగింది. ఈ అధికారిక వేదికపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తన మార్క్ రాజకీయ ప్రసంగంతో విపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనను నిరంతరం గుంపు మేస్త్రీ అని విమర్శించే నేతలకు కౌంటర్ ఇస్తూ "అవును.. నేను గుంపు మేస్త్రినే, నన్ను చాలామంది అలా అవహేళన చేస్తుంటారు, దానికి నేను ఏమాత్రం ఫీల్ కాను" అంటూ ఓపెన్ స్టేట్మెంట్ ఇచ్చారు. ఈ గుంపంతా నా మంత్రులు, నా ఉద్యోగులు, నా ప్రజలు నాదేనని, ఈ గుంపే తన బలమని, తన ప్రతిష్ట అని ఆయన సగర్వంగా ప్రకటించారు.

### మా దగ్గర దొరల పోకడలు లేవు..

### గత పాలకులపై సీఎం ఫైర్!


గత పాలకుల ఫ్యూడల్ మనస్తత్వాన్ని ఎండగడుతూ సీఎం

2లో..

## మోడీ కేబినెట్ ప్రక్షాళనకు

# ముహూర్తం ఫిక్స్

### - రాష్ట్రపతికి అమిత్ షా లిస్ట్.?



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** కేంద్ర కేబినెట్ ప్రక్షాళనపై గత కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారం నిజమేనని తేలిపోయింది. కేంద్ర కేబినెట్లో మార్పులు చేర్పులకు ప్రధాని మోడీ రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా కొత్తగా కేబినెట్లో చేరే మంత్రులు, అలాగే చోటు కోల్పోయే మంత్రుల వివరాలను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. గురువారం హోంమంత్రి అమిత్ షా ఈ జాబితాను ప్రధాని మోడీకి తీసుకెళ్లి అందించినట్లు తెలుస్తోంది. అలాగే కేబినెట్ ప్రక్షాళన తేదీని కూడా ఖరారు చేసినట్లు సమాచారం.

ప్రధాని మోదీ రాష్ట్రపతిని కలిసిన రెండు రోజుల తర్వాత అమిత్ షా సమావేశం జరిగింది. బీజేపీ కొందరు మంత్రులను రాజ్యసభకు తిరిగి నామినేట్ చేయకపోవడం, మరికొందరికి వారి రాష్ట్రాల్లో కీలకమైన సంస్థాగత బాధ్యతలు అప్పగించడం వంటి పరిణామాల

2లో..

## అధ్యాపక పోస్టుల భర్తీ

# వేగవంతం చేయండి

### అధికారులకు మంత్రి లోకేష్ ఆదేశం

- నిరుద్యోగుల కోసం జూలైలో 'నైపుణ్యం' పోర్టల్ ఆవిష్కరణ
- అన్ని ప్రభుత్వ ఐటీఐలలో ఏఐ ల్యాబ్స్ ఏర్పాటుకు చర్యలు
- ప్రతి మూడు నెలలకు ఒకసారి నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు




**అమరావతి (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ఈ దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 1,523 అధ్యాపక పోస్టులకు గాను ఇప్పటివరకు 1,89,316 దరఖాస్తులు వచ్చాయని అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ, ప్రతి దరఖాస్తును డేటా ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. విశ్వవిద్యాలయాన్ని యూనిట్‌గా తీసుకుని నియామకాలు

2లో..

## పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు నోటీసులు

### - దానం, బండ్లకు నోటీసులు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో సంచలనం రేపుతున్న ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. పార్టీ మారినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు క్లీన్‌చీట్ ఇస్తూ తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇచ్చిన తీర్పును పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై విచారణ జరిపిన హైకోర్టు వచ్చే నెలకు వాయిదా వేసింది. బీఆర్ఎస్ పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు

2లో..

# గోదావరి-కృష్ణా-కావేరి అనుసంధానం

### - తుంగభద్ర కార్యక్రమంలో సీఎంల కీలక ప్రకటనలు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రాజకీయాల్లో అత్యంత అరుదైన, దక్షిణాది జలవనరుల చరిత్రలోనే ఒక అపూర్వ మైలురాయిగా నిలిచే చారిత్రాత్మక ఘట్టానికి కృష్ణానది ఉపనది అయిన తుంగభద్ర వేదికైంది. కర్ణాటకలోని విజయనగర జిల్లా హోసపేట సమీపంలో గల మునిరాబాద్ వద్ద తుంగభద్ర జలాశయానికి పూర్తిగా పునరుద్ధరించిన 33 నూతన స్పిల్‌వే క్రస్ట్ గేట్లను గురువారం ఘనంగా జాతికి అంకితం చేశారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ కలిసి సంయుక్తంగా ఈ గేట్లను ప్రారంభించారు. గతంలో చోటుచేసుకున్న జల విపత్తును సవాల్‌గా తీసుకుని, మూడు వ్యయంతో ఈ ఆధునిక గేట్ల మార్పిడి

2లో..

## రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టింది

# రేవంత్ ప్రభుత్వమే

- కేసీఆర్ హయాంలో పరిశ్రమలతో భూముల విలువలు పెరిగాయని వెల్లడి
- ఎన్నికల హామీలను కాంగ్రెస్ అమలు చేయలేదని ఆరోపణ
- రైతు బంధు, దళిత బంధు అంశాల్లో ప్రజలను మోసం చేశారని విమర్శ
- 2028లో కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని కార్యకర్తలకు పిలుపు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాలు ఆసక్తి కరంగా మారుతున్నాయి. కాంగ్రెస్ – బీఆర్ఎస్ నువ్వా నేనా అన్నట్లుగా ఒకరి పై మరొకరు విమర్శలు గుప్పిస్తున్నారు. బీజేపీ సైతం తమ పట్టు పెంచుకునే ప్రయత్నం చేస్తోంది. తిరిగి అధికారంలోకి వస్తామని అటు సీఎం రేవంత్ ధీమాగా చెబుతుండగా ఇటు బీఆర్ఎస్ తమ గెలుపు ఖాయమని ధీమాగా ఉంది. బీజేపీ కొత్త వ్యూహాలను అమలు చేస్తోంది. త్వరలో గ్రేటర్ ఎన్నికలు జరిగే అవకాశం ఉండటంతో సీఎం రేవంత్

2లో..

# ఎల్పీజీపై ఆంక్షల ఎత్తివేత

- బల్క్ ఎల్పీజీ సరఫరాలు 50% మేర పునరుద్ధరణ
- అమెరికా-ఇరాన్ ఒప్పందంతో మెరుగైన దిగుమతులు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు వినియోగించే ఎల్పీజీ సరఫరాపై విధించిన ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ఎత్తివేసింది. అమెరికా–ఇరాన్ శాంతి ఒప్పందం, హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకోవడంతో దిగుమతుల పరిస్థితి మెరుగుపడటమే ఈ నిర్ణయానికి కారణమని

2లో..

## రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు

# వెళుతోంది

### - గణాంకాలతో వైఎస్ జగన్ సంచలన ట్వీట్!



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్‌లో మహిళా స్వయం సహాయక సంఘాలకు అందుతున్న రుణ సహాయంలో తీవ్ర క్షీణత కనిపిస్తోందని, ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను కోలుకోలేని దెబ్బతీస్తోందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన మరో హామీని నిలుపుకోవడంలో ఘోరంగా విఫలమైందని ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గ్రామీణ ఆర్థిక రంగానికి జీవనాడి లాంటి డ్వాక్రా రుణాల వృద్ధి పడిపోవడం అనేది నేడు రాష్ట్రంలో నెలకొన్న ఆర్థిక ఇబ్బందులకు, ప్రజల కొనుగోలు శక్తి

2లో..

## గ్రూప్-1లో 200 మంది

# పక్క రాష్ట్రాల వాళ్లే

### - రేవంత్ సర్కార్‌పై కవిత సంచలన ఆరోపణలు




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ స్థానికత – సవాళ్లు ' రౌండ్ టేబుల్ సమావేశంలో కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ నేలపై స్థానికత, ముల్కీ హక్కుల కోసం గత 600 ఏళ్లుగా నిరంతర దాడి, పోరాటం జరుగుతూనే ఉన్నాయని చరిత్రను గుర్తుచేశారు. బహుమనీ సామ్రాజ్యం కాలం నాటి పోరాటాల నుండి, 1919 ముల్కీ నిబంధనలు, 1952 ఇడ్లీ సాంబార్ గో బ్యాక్' ఉద్యమం, 1969 ప్రత్యేక రాష్ట్ర పోరాటం వరకు ప్రతి దశలోనూ తెలంగాణ యాస, భాష, ఉద్యోగ వనరులపై పరాయి పాలకులు అన్యాయం చేస్తూనే వచ్చారని మండిపడ్డారు. ఎంతోమంది త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో కూడా నేడు స్థానికుల హక్కులు కాలరాస్తున్నారని ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

### న్యాయమూర్తులు అర్థం చేసుకోవాలి!

రాష్ట్రపతి ఉత్తర్వులలో ఉన్న నిబంధనలను తప్పుగా

2లో..

# వెనిజువెలాను వణికించిన జంట భూకంపాలు

### - 7.2, 7.5 తీవ్రతలతో వరుస ప్రకంపనలు

- లా గ్వైరా ప్రాంతంలో భారీ విధ్వంసం - అనేక భవనాలు కూలిపోవడంతో సహాయక చర్యలు
- ప్రధాన విమానాశ్రయం, మెట్రో సేవలకు అంతరాయం



**కారకాస్ (ప్రశ్న న్యూస్)** వెనిజువెలా కరీబియన్ తీరప్రాంతంలో బుధవారం (జూన్ 24) సాయంత్రం సంభవించిన రెండు వరుస భారీ భూకంపాలు ఆ దేశాన్ని వణికించాయి. రాజధాని కారకాస్ సహా పలు నగరాల్లో భూమి కంపించడంతో అనేక భవనాలు కుప్పకూలాయి. భారీ ఆస్తి నష్టం సంభవించడంతో పాటు కరీబియన్ తీర ప్రాంత దేశాలు సునామీ భయంతో వణికిపోయాయి. ఇప్పటి వరకు 164 మంది

2లో..

# పాస్‌పోర్ట్ ఫీజులు భారీ పెంపు

### - జూలై 1 నుంచి కొత్త ధరలు అమలు

2లో..



# నేను గుంపు మేస్త్రినే

రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది తాము చాలా గొప్పవాళ్లమని, తాము దొరలమని ఇళ్లల్లో కూర్చుని గొప్పలు చెప్పుకుంటారు అలాంటి అహంకారపూరిత, దొరల పోకడలు నా దగ్గర లేవు అని స్పష్టం చేశారు. తానే స్వయంగా ఒక సాధారణ స్థాయి నుండి కష్టపడి పైకి వచ్చిన వ్యక్తిని కాబట్టే ప్రజల కష్టాలు, ఉద్యోగుల బాధలు తనకు తెలుసన్నారు. సచివాలయానికి రాకుండా ప్రగతి భవన్, ఫామ్‌హౌస్‌లకే పరిమితమైన కాలం పోయిందని, ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల కోసం నడిచే ప్రభుత్వం ఇదని ఆయన గుర్తుచేశారు.

### ఉద్యోగులకు సీఎం పిలుపు రోజుకో గంట అదనంగా పని చేద్దాం!

తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని రేవంత్ రెడ్డి అభివర్ణించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. రాష్ట్ర సంక్షేమం కోసం మనం రోజుకో గంట అదనంగా పని చేద్దాం అంటూ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. పన్నులు కట్టకుండా, లూప్‌హోల్స్ వాడుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిని పట్టుకునే బాధ్యత ఉద్యోగ యంత్రాంగంపైనే ఉందన్నారు. పారదర్శకంగా పన్నుల వసూళ్లను పెంచి, రాష్ట్ర ఆదాయాన్ని వృద్ధి చేయాలని, అలా పెరిగిన ఆదాయాన్ని తిరిగి ఉద్యోగుల ప్రయోజనాలకు, ప్రజా సంక్షేమానికే ఖర్చు పెడతానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.

### ఉద్యోగుల ఇన్సూరెన్స్ ఒప్పందం ఒక అపూర్వ ఘట్టం!

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబాల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ఇన్సూరెన్స్ ఒప్పందాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కుదుర్చుకుంది. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ఉద్యోగులకు అత్యుత్తమ వైద్య బీమా సౌకర్యాన్ని కల్పించబోతున్నట్లు వెల్లడించారు. ఉద్యోగులు ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా, పూర్తి ఆరోగ్యంతో విధుల్లో పాల్గొనడమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని సీఎం పేర్కొన్నారు. ఈ ఎంఓయూ ద్వారా వేలాది మంది సచివాలయ, జిల్లా స్థాయి ప్రభుత్వ ఉద్యోగులకు నేరుగా లబ్ధి చేకూరనుంది.

## మోడీ కేబినెట్ ప్రక్షాళనకు ముహూర్తం ఫిక్స్

నేపథ్యంలో కేబినెట్ ప్రక్షాళన తప్పదని తేలిపోయింది. ఇప్పుడు రాష్ట్రపతిని వరుసగా ప్రధాని మోడీ, అమిత్ షా కలవడంతో ఈ ఊహాగానాలు నిజమవుతున్నాయి. అమిత్ షాతో భేటీకి సంబంధించిన ఫొటోను రాష్ట్రపతి భవన్ ట్వీట్ చేసింది.కేరళకు చెందిన సీనియర్ బీజేపీ నేత జార్జ్ కురియన్, తన రాజ్యసభ పదవీకాలం ముగిసిన నేపథ్యంలో తాజాగా మంత్రిమండలి బాధ్యతల నుంచి తప్పుకున్నారు. 65 ఏళ్ల కురియన్ మైనారిటీ వ్యవహారాల శాఖతో పాటు మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ శాఖల సహాయ మంత్రిగా వ్యవహరించారు. జూన్ 21తో ఎగువ సభ (రాజ్యసభ)లో పదవీకాలం ముగిసిన కురియన్‌ను తిరిగి నామినేట్ చేయకూడదని బీజేపీ నిర్ణయించింది. అలాగే జూన్ 21తో రాజ్యసభ పదవీకాలం ముగిసిన రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ సింగ్‌ను కూడా బీజేపీ ఎగువ సభకు తిరిగి నామినేట్ చేయలేదు. ఆగస్టు 2024 నుండి రాజస్థాన్ తరపున రాజ్యసభ సభ్యుడిగా ఉన్న సింగ్, ప్రస్తుతం ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## అధ్యాపక పోస్టుల భర్తీ వేగవంతం చేయండి

చేపడుతున్నందున, ఎంపిక కమిటీలకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని స్పష్టం చేశారు. వీలైనంత త్వరగా ఈ నియామక ప్రక్రియను ముగించాలని ఆదేశించారు. స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుకు సంబంధించి పరిశ్రమలతో తప్పనిసరిగా ఒప్పందాలు ఉండాలని, దీని కోసం రూపొందించే చట్టం దేశానికే ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.నిరుద్యోగ యువత కోసం రూపొందించిన 'నైపుణ్యం' పోర్టల్‌ను వచ్చే నెలలో ఆవిష్కరించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. దీని ద్వారా నమోదైన ప్రతి ఒక్కరికీ ఆన్‌లైన్ స్కిల్ కార్డు జారీ చేస్తామని వెల్లడించారు. పీఎం సేతు పథకం కింద మంజూరైన క్లస్టర్లలో ఐటీఐలను బలోపేతం చేయాలని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో అన్ని ప్రభుత్వ ఐటీఐలలో ఏఐ ల్యాబ్స్‌లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కార్పొరేషన్ (ఓంక్యాప్) ఆధ్వర్యంలో వచ్చే నెలలో 146 మందికి విదేశీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1,30,422 మందికి ఉద్యోగాలు లభించాయని, ఇకపై ప్రతి త్రైమాసికానికి నియోజకవర్గ కేంద్రాల్లో జాబ్ మేళాలు నిర్వహించాలని లోకేష్ ఆదేశించారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు, ఉన్నత విద్యాశాఖ కమిషనర్ నారాయణ భరత్ గుప్త, స్కిల్ డెవలప్‌మెంట్ ఎండీ గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు నోటీసులు

పార్టీ మారలేదని స్పీకర్ గతంలోనే తీర్పును వెలువరించగా ఆ నిర్ణయాన్ని పలువురు ఎమ్మెల్యేలు సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు.అయితే బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తాము సరైన ఆధారాలు సమర్పించినా వారిపై చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై స్పీకర్ విఫలం అయ్యారని పేర్కొంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పిటిషన్లు వేయగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలంటూ బీజేపీ లెజిస్లేచర్ పార్టీ అధ్యక్షుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు.తాజాగా అన్ని పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ ట్రిబ్యునల్ తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన రిపోర్టులను సమర్పించాలని గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. తాజాగా దానిపై విచారణ జరిపిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ప్రతివాదులైన దానం నాగేందర్, బండ్ల కృష్ణమోహన్ రెడ్డిలు కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలోనే ఈ పిటిషన్లపై తదుపరి విచారణను జూలై 22వ తేదీకి వాయిదా వేసింది. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున కారు గుర్తుపై పోటీ చేసి గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు ఆ తర్వాత వారు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరారు. మొత్తం 10 మంది ఎమ్మెల్యేలు ఇలా పార్టీ మారినట్లు బీఆర్ఎస్ పార్టీ ఆరోపించింది. ఈ విషయంలో గతంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు న్యాయపోరాటానికి దారితీసింది.

## వెనిజువెలాను వణికించిన జంట భూకంపాలు

చనిపోయినట్లు గుర్తించారు. మరో 971 మంది తీవ్రంగా గాయపడ్డారు. భవనాల శిథిలాల కింద చాలా మంది చిక్కుకుపోయినట్లు అనుమానిస్తున్నారు. దీంతో మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.యూఎస్ జియోలాజికల్ సర్వే నివేదిక ప్రకారం మొదట కారకాస్‌కు పశ్చిమాన 160 కిలోమీటర్ల దూరంలోని మొరోన్ సమీపంలో 7.1 తీవ్రతతో భూకంపం సంభవించగా, సరిగ్గా దాని తర్వాతి నిమిషంలోనే అదే ప్రాంతంలో 7.5 తీవ్రతతో రెండో భూకంపం కుదిపేసింది. భూ అంతర్భాగంలో కేవలం 10 నుండి 13 కిలోమీటర్ల లోతులోనే ఈ ప్రకంపనలు కేంద్రీకృతం కావడం వల్ల నష్టం తీవ్రత ఎక్కువగా ఉందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. శతాబ్ద కాలంలో వెనిజువెలా ఎదుర్కొన్న అత్యంత బలమైన భూకంపాలలో ఇది ఒకటి.

## కారకాస్‌లో భీతావహ వాతావరణం

భూమి ఒక్కసారిగా ఊగిపోవడంతో ప్రజలు ప్రాణభయంతో ఇళ్ల నుండి వీధుల్లోకి పరుగులు తీశారు. అనేక భవనాల గోడలు కూలిపోయి లోపల ఉన్న ఫర్నిచర్ రోడ్డుపైకి కనిపించేలా దెబ్బతిన్నాయి. కారకాస్‌లోని ప్రముఖ అల్టామిరా పరిసర ప్రాంతాల్లో, తీర ప్రాంత నగరమైన లా గుఐరాలో బహుళ అంతస్తుల అపార్ట్‌మెంట్లు, గృహాలు కుప్పకూలాయి. ప్రమాద స్థలాల నుండి భారీగా ధూళి మేఘాలు గాల్లోకి లేచాయి.

విద్యుత్, ఇంటర్నెట్ వ్యవస్థలు పూర్తిగా స్తంభించిపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలిగింది. దేశ అంతర్గత వ్యవహారాల మంత్రి డియోస్డాడో కాబెల్లో ప్రభుత్వ టెలివిజన్ ద్వారా మాట్లాడుతూ.. "అల్టామిరా ప్రాంతంలో భవనాలు, ఇళ్లు కూలిపోయిన అత్యంత ఆందోళనకర పరిస్థితులు ఉన్నాయి. అందుబాటులో ఉన్న అన్ని వనరులతో సహాయక చర్యలు అందిస్తున్నాం" అని తెలిపారు. తదుపరి ప్రకంపనలు వచ్చే ముప్పు ఉన్నందున ప్రజలు ఇళ్లలోకి వెళ్లకుండా బహిరంగ ప్రదేశాల్లోనే ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంబులెన్సుల రవాణాకు ఆటంకం కలిగించకుండా వాహనదారులు సహకరించాలని కోరారు.

### తాత్కాలిక సునామీ హెచ్చరికలు

ఈ భారీ భూకంపాల నేపథ్యంలో అమెరికాకు చెందిన పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం ప్యూర్టో రికో, యూఎస్ అండ్ బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్, అలాగే వెనిజులా తీర ప్రాంతాలకు తక్షణ సునామీ అడ్వైజరీ జారీ చేసింది. సముద్ర అలల్లో తీవ్ర మార్పులు, బలమైన పోటు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించినప్పటికీ, సుమారు గంట తర్వాత పరిస్థితి అదుపులోకి రావడంతో ఈ హెచ్చరికలను ఉపసంహరించుకున్నారు. కరీబియన్, దక్షిణ అమెరికా టెక్టోనిక్ ప్లేట్ల సరిహద్దుల్లో ఉండే వెనిజువెలా తీవ్రమైన భూకంపాల జోన్‌లో ఉంది. 1821 నాటి స్వాతంత్ర్య యుద్ధ విజయానికి గుర్తుగా దేశవ్యాప్తంగా ప్రభుత్వ సెలవు దినం జరుపుకుంటున్న రోజే ఈ ఘోర విపత్తు సంభవించింది. 1967 నాటి ప్రాణాంతక భూకంపం కంటే కూడా దీని తీవ్రత భయంకరంగా ఉందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

## గోదావరి-కృష్ణా-కావేరి అనుసంధానం

ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.

### నదుల అనుసంధానమే మార్గం : సీఎం చంద్రబాబు

గేట్ల ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో మూడు రాష్ట్రాల ప్రభుత్వాధినేతలు ఒకే వేదికపైకి రావడం చారిత్రాత్మక అంశమన్నారు. "తుంగా పానం.. గంగా స్నానం" అనే సామెతను గుర్తు చేస్తూ, తుంగభద్ర నీరు అంత పవిత్రమైనదని కొనియాడారు. గతేడాది 19వ గేట్ కొట్టుకుపోయినప్పుడు నిపుణుడు కన్నయ్య నాయుడు ద్వారా స్టాప్‌లాక్ గేట్ అమర్చి నీరు వృధా కాకుండా కాపాడామని, ఇప్పుడు ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు కలిసి పనిచేసి మొత్తం 33 గేట్లను మార్చడం అభినందనీయమన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల నీటి లభ్యత తగ్గుతున్న తరుణంలో నదుల అనుసంధానమే దేశానికి అన్‌స్టాపబుల్ వృద్ధిని ఇస్తుందని, ప్రధాని మోదీ నేతృత్వంలో వన్ నేషన్ - వన్ గ్రిడ్ లాగే గోదావరి-కావేరి అనుసంధానం ద్వారా దక్షిణాది రాష్ట్రాల రైతుల ప్రయోజనాలను కాపాడుకుందామని పిలుపునిచ్చారు.

### రాష్ట్రాల మధ్య పంచాయతీలు వద్దు.. పరస్పర సహకారమే ముఖ్యం: సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తుంగభద్ర డ్యామ్ క్రస్ట్ గేట్ల పునరుద్ధరణ కేవలం ఒక టెక్నికల్ విజయం మాత్రమే కాదని, మూడు రాష్ట్రాల కరువు జిల్లాల సమస్యల పరిష్కారానికి పడిన కీలక అడుగని అభివర్ణించారు. ఏపీలోని కర్నూలు, అనంతపురం , తెలంగాణలోని మహబూబ్‌నగర్ ప్రజల వలసల బాధలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. రాష్ట్రాల మధ్య జల వివాదాల పంచాయతీలు పక్కనబెట్టి, కేవలం రైతుల శ్రేయస్సు కోసమే సమస్యలను పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు. తుంగభద్ర నుంచి తెలంగాణకు చట్టబద్ధంగా రావలసిన 10 టీఎంసీల నీరు ఇంకా రావడం లేదని ప్రస్తావిస్తూ రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ కింద ఉన్న తెలంగాణ రైతులకు న్యాయం జరిగేలా కర్ణాటక, ఏపీ రాష్ట్రాలు సహకరించాలని కోరారు. వివాదాలు వీడి పరస్పర సహకారంతో ముందుకు సాగితేనే అంతిమంగా రైతులకు మేలు జరుగుతుందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

### రైతాంగానికి రక్షణ కవచం.. కర్ణాటక సీఎం డీకే శివకుమార్ హర్షం

ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో కర్ణాటక ముఖ్యమంత్రి శివకుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. డ్యామ్ నిర్మించిన 70 ఏళ్ల తర్వాత తొలిసారిగా పాత గేట్ల స్థానంలో హై-గ్రేడ్ స్టీల్ గేట్లను అమర్చామని తెలిపారు. గతేడాది ప్రమాదం జరిగినప్పుడు కేవలం పాత గేటుకు ప్యాచ్ వర్క్ చేయకుండా, భవిష్యత్ తరాల భద్రతను దృష్టిలో ఉంచుకుని మొత్తం 33 గేట్లను మార్చేలా అంతరాష్ట్ర సమన్వయంతో బోర్డు నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. ఈ నూతన గేట్ల ఏర్పాటుతో రాబోయే సీజన్‌లో పూర్తి స్థాయిలో 105 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునేందుకు జలాశయం సురక్షితంగా సిద్ధమైందన్నారు. కర్ణాటకలో 9 లక్షల ఎకరాలు, ఏపీలో 6 లక్షల ఎకరాలు, తెలంగాణలో 87 వేల ఎకరాల ఆయకట్టు రైతులకు ఈ ప్రాజెక్ట్ ద్వారా సుస్థిరమైన సాగునీరు అందుతుందని, నవలి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పూడికతీత అంశాలపై కూడా మూడు రాష్ట్రాల మధ్య సయోధ్య కుదరడం శుభపరిణామమని వారు పేర్కొన్నారు.

### దక్షిణాది రాష్ట్రాల ఐక్యత దేశానికే ఆదర్శం: కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్

కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ జల వనరుల నిర్వహణలోను, అంతరాష్ట్ర సమస్యల పరిష్కారంలోనూ ఏపీ, తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు చూపిన చొరవ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వం నదుల అనుసంధానానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, యూపీ-ఎంపీల మధ్య 'కెన్-బెత్వా' ప్రాజెక్ట్ తరహాలోనే దక్షిణాదిలోనూ గోదావరి-కృష్ణా-కావేరి అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. మూడు రాష్ట్రాల రైతుల నీటి హక్కులను కాపాడుతూ, తాగునీటి ఎద్దడిని నివారించడమే లక్ష్యంగా కేంద్ర జలశక్తి శాఖ రాష్ట్రాలకు పూర్తి సాంకేతిక, ఆర్థిక మద్దతును అందిస్తుందని భరోసా ఇచ్చారు.


## రియల్ ఎస్టేట్‌ను బొంద పెట్టింది రేవంత్ ప్రభుత్వమే

లక్ష్యంగా కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు ఆసక్తి కరంగా మారుతున్నాయి.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేసారు. ప్రభుత్వం లేదు పవర్ లేదు కానీ గర్వంగా ఎక్కడనిపిస్తుందంటే ఎమ్మెల్యే పోయినా ఎంపీ పోయినా అధికారం పోయినా ఇంతమంది సోదరులు ఇక్కడికొచ్చి మీరు చేస్తున్న ప్రకటన మామూలు ప్రకటన కాదు ఇది కాంగ్రెస్, బీజేపీ పార్టీ గుండెల్లో రైళ్లను ఉరికించే గొప్ప దృశ్యం ఇక్కడ కనిపిస్తుందంటూ కేటీఆర్ వ్యాఖ్యానించారు. చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణా కార్యక్రమంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేసారు. "మనకు అధికారం పోయి రెండున్నరేళ్లు అయింది. ఎన్నికల ముందేమో నేను గుంపు మేస్త్రీని. రియల్ ఎస్టేట్ అంటేనే రేవంత్ రెడ్డి, రేవంత్ రెడ్డి అంటేనే రియల్ ఎస్టేట్ అని ఫోజులు కొట్టిండు. ఇవాళ రియల్ ఎస్టేట్‌ను ఏం చేసిండు మరి బొంద పెట్టిండు వంద ఫీట్ల అడుగులో పాతిపెట్టే పని చేసిండని మండిపడ్డారు.దీనికి కొనసాగింపుగా "మన ప్రభుత్వం, పెద్దలు కేసీఆర్ ఉన్నప్పుడు షాబాద్‌లో చందన్ వెల్లిలోకానీ, సీతారాంపూర్‌లో కానీ ఎకరం 30 లక్షలుండేది. కానీ అక్కడ ఇండస్ట్రియల్ పారిశ్రామిక పార్క్ తీసుకొచ్చిన తర్వాత అక్కడ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కంపెనీలు ఒక మైక్రోసాఫ్ట్, అమెజాన్ వెల్స్‌ఫన్ ఇతర కంపెనీలు తీసుకొచ్చిన తర్వాత నేడు ఎకరం 3 కోట్లకు తక్కువ షాబాద్‌లో లేని పరిస్థితి ఉంది. అదే రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత లక్షల మంది రియల్ ఎస్టేట్ మీద ఆధారపడి పనిచేసుకునే తమ్ముళ్లు, చెల్లెళ్లందరూ ఇవాళ దివాళా తీసే పరిస్థితి వచ్చిందంటూ" కేటీఆర్ వ్యాఖ్యానించారు.ఎందుకీ పరిస్థితి ఉందనేది మనం ఆలోచన చేసుకోవాల్సి ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.

## ఎల్పీజీపై ఆంక్షల ఎత్తివేత

కేంద్ర పెట్రోలియం శాఖ వెల్లడించింది. సంక్షోభం సమయంలో నిలిపివేసిన బల్క్ ఎల్పీజీ సరఫరాలను కూడా ఇప్పుడు 50 శాతం మేర పునరుద్ధరించారు. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్న పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు ఉపశమనం లభించనుంది. పశ్చిమాసియా సంక్షోభం సమయంలో దేశీయ వినియోగదారులకు ఎలాంటి కొరత రాకుండా ఉండేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎల్పీజీ ఉత్పత్తి కోసం అవసరమైన సీ3-సీ4 గ్యాస్ వనరులను ఇతర రంగాలకు మళ్లించకుండా, పూర్తిగా గృహ వినియోగ ఎల్పీజీ తయారీకి కేటాయించింది. ఇప్పుడు పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకోవడంతో ఆ పరిమితులను కూడా సడలించింది. అయితే దేశీయ ఎల్పీజీ ఉత్పత్తి రోజుకు కనీసం 40 వేల మెట్రిక్ టన్నుల కంటే తగ్గకుండా చర్యలు కొనసాగుతాయని కేంద్రం స్పష్టం చేసింది. అదే సమయంలో పెట్రోకెమికల్ రంగం అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకుని సీ3-సీ4 వనరుల కేటాయింపును పెంచనుంది. ఇక పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) విస్తరణపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటికే ఈ గ్యాస్ వినియోగిస్తున్న వాణిజ్య సంస్థలు అదే విధానంలో కొనసాగుతాయని స్పష్టం చేసింది. నెట్‌వర్క్ అందుబాటులో ఉన్న ఇతర వినియోగదారులను కూడా దశలవారీగా పీఎన్‌జీ వైపు మళ్లించనున్నట్లు తెలిపింది.

## పాస్‌పోర్ట్ ఫీజులు భారీ పెంపు




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పాస్‌పోర్ట్ జారీకి సంబంధించిన రుసుములను కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచింది. సవరించిన ధరలు 2026 జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ (ఎంఈఏ) వెల్లడించింది. ఈ మేరకు జూన్ 20న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పాస్‌పోర్ట్ సేవల నిర్వహణ ఖర్చులు పెరగడంతో సుదీర్ఘ విరామం తర్వాత ఈ పెంపు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తాజా సవరణల ప్రకారం, సాధారణ కేటగిరీలో 36 పేజీల అడల్ట్ పాస్‌పోర్ట్ ఫీజు రూ.1,500 నుంచి రూ.2,500కి (67 శాతం పెంపు) పెరిగింది. అదేవిధంగా, 60 పేజీల పాస్‌పోర్ట్ రుసుము రూ.2,000 నుంచి రూ.3,500కి (75 శాతం పెంపు) చేరింది. తత్కాల్ స్కీమ్ కింద 36 పేజీల పాస్‌పోర్ట్‌కు రూ.5,000, 60 పేజీల పాస్‌పోర్ట్‌కు రూ.6,000 చెల్లించాల్సి ఉంటుంది. ఇక 18 ఏళ్లలోపు మైనర్లకు 36 పేజీల పాస్‌పోర్ట్ ఫీజును రూ.1,750గా నిర్ణయించారు. పాస్‌పోర్ట్ పోగొట్టుకున్నా లేదా పాడైపోయినా తిరిగి పొందేందుకు అయ్యే రీప్లేస్‌మెంట్ ఖర్చులను కూడా గణనీయంగా పెంచారు. సాధారణ విధానంలో 36 పేజీల పాస్‌పోర్ట్ రీప్లేస్‌మెంట్‌కు రూ.5,000, 60 పేజీల పాస్‌పోర్ట్‌కు రూ.6,000 చెల్లించాలి. వీటినే తత్కాల్ విధానంలో పొందాలంటే వరుసగా రూ.7,500, రూ.8,500 ఖర్చవుతుంది. కాగా, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్ (పీసీసీ) ఫీజును రూ.750గా ఖరారు చేశారు. ప్రస్తుతం పాస్‌పోర్ట్ సేవా పోర్టల్‌లో పాత రుసుములే కనిపిస్తున్నప్పటికీ, జూలై 1 నుంచి కొత్త ధరలు వర్తిస్తాయి. అయితే పాస్‌పోర్ట్ కాలపరిమితిలో ఎలాంటి మార్పులు లేవని అధికారులు స్పష్టం చేశారు. పెద్దలకు 10 ఏళ్లు, మైనర్లకు 5 ఏళ్ల పాటు పాస్‌పోర్ట్ చెల్లుబాటు కానుంది.

## రాష్ట్రం ఆర్థిక మాంద్యం వైపు వెళుతోంది

క్షీణించడానికి నిదర్శనమని ఆయన తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

### ఆర్థిక సంక్షోభానికి అద్దం పడుతున్న పన్నుల ఆదాయం!

రుణాల వృద్ధి రేటు తగ్గడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉత్పాదక పెట్టుబడులు, తద్వారా ఆదాయాలు తగ్గిపోయాయని వైఎస్ జగన్ విశ్లేషించారు. దీని ప్రభావం నేరుగా వినియోగంపై పడిందని, అందుకే 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వ పన్నుల ఆదాయ వృద్ధి రేటు మైనస్ లో నమోదు కావడం స్పష్టమైన ఆర్థిక సంక్షోభాన్ని సూచిస్తోందని గుర్తుచేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కేవలం వడ్డీ లేని రుణాల పథకం కింద రూ. 4,969 కోట్ల నేరుగా సాయం అందించడంతో పాటు ఆసరా, చేయూత వంటి విప్లవాత్మక కార్యక్రమాలతో మహిళలను ఆర్థికంగా నిలబెట్టామని ఆయన వివరించారు.

### రూ. 10 లక్షల హామీ ఏమైంది? కూటమిపై జగన్ ప్రశ్నల వర్షం

ఎన్నికల మేనిఫెస్టోలో టీడీపీ-జనసేన కూటమి ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక పూర్తిగా గాలికొదిలేశారని వైఎస్ జగన్ ధ్వజమెత్తారు. డ్వాక్రా మహిళల వడ్డీ లేని రుణ పరిమితిని రూ. 3 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచుతామని చెప్పి, నేడు ఉన్న పథకాన్ని కూడా నిర్వీర్యం చేశారని ఆరోపించారు. గత రెండేళ్ల బడ్జెట్ గణాంకాలను ప్రస్తావిస్తూ 2024-25లో వడ్డీ సబ్సిడీ కింద విడుదల చేసిన నిధులు సున్నా అని, 2025-26 బడ్జెట్‌లో రూ. 100 కోట్లు కేటాయించినా విడుదల చేసింది మళ్లీ సున్నా అని ఎండగట్టారు. పెంచిన హామీ ప్రకారం చూసుకుంటే ఈ రెండేళ్లలో కూటమి ప్రభుత్వం మహిళలకు ఇవ్వాల్సిన దాదాపు రూ. 6,000 కోట్ల నిధులను నొక్కేసిందని జగన్ విమర్శించారు.

### రూ. 49 వేల కోట్ల నుండి రూ. 41 వేల కోట్లకు పడిపోయిన రుణాలు

గత వైసీపీ పాలనలో మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజ్ రుణాలు క్రమబద్ధంగా పెరిగాయని, ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల అవి దారుణంగా పడిపోయాయని జగన్ గణాంకాలతో సహా నిరూపించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 49,696 కోట్లుగా ఉన్న ఎస్‌హెచ్‌జీ రుణాలు, కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25 నాటికి రూ. 41,623 కోట్లకు, అలాగే 2025-26 నాటికి మరింతగా రూ. 41,105 కోట్లకు క్షీణించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి మద్దతు లేకపోవడం వల్లే బ్యాంకులు కూడా రుణాలు ఇవ్వడానికి వెనకాడుతున్నాయని ఆయన స్పష్టం చేశారు.

### మహిళల ద్రోహంపై వైసీపీ క్షేత్రస్థాయి పోరాటం!

కూటమి ప్రభుత్వం మహిళా లోకాన్ని మోసం చేసిందని, దీనిపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని వైఎస్ జగన్ అన్నారు. కేవలం గ్రాఫిక్స్, అబద్ధపు ప్రచారాలతో కాలం వెళ్లదీస్తున్న పాలకులకు డ్వాక్రా మహిళలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. బడ్జెట్ కేటాయింపులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, తక్షణమే మహిళా సంఘాల వడ్డీ సబ్సిడీ నిధులను విడుదల చేయాలని, రూ. 10 లక్షల రుణ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా సాధికారతను దెబ్బతీసే ఇలాంటి ప్రజావ్యతిరేక విధానాలపై వైసీపీ క్షేత్రస్థాయిలో పోరాడుతుందని స్పష్టం చేశారు.

## గ్రూప్-1లో 200 మంది పక్క రాష్ట్రాల వాళ్లే

అన్వయిస్తూ స్థానికులకు కోలుకోలేని నష్టం చేస్తున్నారని కవిత ఆరోపించారు. ఉత్తర్వులలోని మూడు వేర్వేరు అంశాలను కలిపి చూస్తామనడం సరికాదని, ప్రెసిడెన్షియల్ ఆర్డర్ నంబర్ 7 ప్రకారం స్థానికులకు రాజ్యాంగబద్ధమైన రక్షణ కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గౌరవ న్యాయమూర్తులు ఇక్కడి నిరుద్యోగుల దుఃఖాన్ని, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని అర్థం చేసుకోవాలని కోరారు. పక్క రాష్ట్రాల్లో మన వాళ్లు నాలుగేళ్లు చదివితే అక్కడ లోకల్‌గా గుర్తిస్తారా అని ప్రశ్నించిన ఆమె మన వనరులను ఇతర ప్రాంతాల వారు దోచుకునేలా ఇప్పుడున్న పరిస్థితులు చూస్తుంటే తెలంగాణలో మళ్లీ పాత ముల్కీ నిబంధనలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు.

### గ్రూప్-1లో 200 మంది ఇతర రాష్ట్రాల వారే

ఇటీవల ముగిసిన గ్రూప్-1 నియామకాల్లో తెలంగాణ అభ్యర్థులకు జరిగిందో పెద్ద కుట్రని కవిత ఘాటుగా ఆరోపించారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం కేవలం ఇద్దరికే అవకాశం ఇవ్వాల్సిన చోట, నిబంధనలను తుంగలో తొక్కి 11 మంది ఇతర రాష్ట్రాల వారికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. బయటి రాష్ట్రాల అభ్యర్థులకు ఇక్కడి ఈడబ్ల్యూఎస్, బీసీ-డీ సర్టిఫికెట్లు అక్రమంగా కేటాయించి పోస్టులు కట్టబెట్టారని, మొత్తం 563 గ్రూప్-1 ఉద్యోగాలలో దాదాపు 200 మంది ఇతర రాష్ట్రాల వాళ్లే ఉన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. నిరుద్యోగులు దీనిపై న్యాయపోరాటం చేయకుండా ప్రభుత్వం పెద్ద పెద్ద లాయర్లకు ప్రజాధనం ఇచ్చి కేసులను బెంచ్ మీదికి రాకుండా అడ్డుకుంటోందని విమర్శించారు.

### జూలై 2న 'మిలియన్ మార్చ్'కు పిలుపు!

రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ప్రైవేట్ రంగంలోనూ ఒక్క ఉద్యోగం రావడం లేదని కవిత ఆరోపించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎస్బీఐ బ్యాంకుకు ఇచ్చిన భూమిని తిరిగి అమ్ముకోవడంతో ప్రభుత్వంపై సదరు బ్యాంకే కేసు వేసే దుస్థితి వచ్చిందని, ఇలాంటి వాతావరణంలో రాష్ట్రానికి పెట్టుబడులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. ఒకవైపు నీళ్ల విషయంలో కర్ణాటక రాష్ట్రం తెలంగాణకు అన్యాయం చేస్తుంటే సీఎం రేవంత్ రెడ్డి అక్కడికి వెళ్లి మంగళహారతులు పడుతూ మన నీటి వాటాను, హక్కులను కోల్పోయేలా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ అన్యాయాలపై పోరాడటానికి జూలై 2న ఉప్పల్ భగాయత్ వేదికగా మరో 'మిలియన్ మార్చ్' జరగబోతోందని, హక్కుల సాధన కోసం మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

### సుప్రీంకోర్టుకు వెళ్లకపోతే మేమే వెళ్తాం..

స్థానికత అంశంపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి 15 రోజుల సమయం ఇస్తున్నాం, గట్టి లాయర్లను పెట్టి ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయకపోతే, నిరుద్యోగుల పక్షాన బీఆర్ఎస్ పార్టీయే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుంది అని స్పష్టం చేశారు. ఈ తీర్పును ఇప్పుడే అడ్డుకోకపోతే పరాయి రాష్ట్రాల దోపిడీకి ఫ్లడ్‌గేట్లు ఎత్తినట్లే అవుతుందన్నారు. రాబోయే రోజుల్లో తాము అధికారంలోకి రాగానే రేవంత్ రెడ్డి సర్కార్ గ్రూప్-1లో చేపట్టిన నియామకాలపై జ్యూడిషియల్ రివ్యూ కమిటీ వేసి, జరిగిన అన్యాయాలను పూర్తిగా సరిదిద్ది తీరుతామన్నారు.

## గోపవరం మండల పరిధిలోని ప్రభుత్వ భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



**బద్వేలు** బద్వేల్ పట్టణంలో భాగమైన గోపవరం మండలంలోని గోపవరం గ్రామ పొలం 1983/1, 1984/1 లోని 3.5 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఆర్డిఓ చంద్రమోహన్ ఆదేశాల మేరకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు గోపవరం మండల తాసిల్దార్ జీవన్ తెలియజేశారు.. అలాగే గోపవరం గ్రామ పొలం 1848, 1852 సర్వే నెంబర్లలోని 80 సెంట్లు భూమి, అలాగే 1852 లోని మరో ఒకటిన్నర ఎకరా ప్రభుత్వ భూమిలో కూడా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశామని తాసిల్దార్ పేర్కొన్నారు.

## మేడ్చల్ లో ఘనంగా ప్రారంభమైన సర్ కార్యక్రమం



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మేడ్చల్ పట్టణం పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటింటికి వెళ్లి,ఓటర్ల జాబితాను పరిశీలిస్తూ కొత్త ఓట్ల నమోదు ప్రక్రియను చేపట్టారు.ఈ ఓటర్ల నమోదు కార్యక్రమానికి మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రామన్నగారి రాఘవేంద్ర గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై,అధికారుల పనితీరును పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మేడ్చల్ డివిజన్ ప్రజలను ఉద్దేశించి ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇచ్చారు.వేముల శ్రీనివాస్ రెడ్డి,రామన్నగారి రాఘవేంద్ర గౌడ్ మాట్లాడుతూ:"ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైన ఆయుధం. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి. ప్రస్తుతం డివిజన్ లో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో ప్రజలందరూ చురుగ్గా పాల్గొనాలి. ఇళ్ల వద్దకు వచ్చే బిఎల్ఓ అధికారులకు ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలి. ఓటు నమోదుకు లేదా సవరణలకు అవసరమైన సరైన డాక్యుమెంట్లను అధికారులకు అందించి, మీ ఓటు ఓటర్ల జాబితాలో తప్పిపోకుండా జాగ్రత్తపడాలి" అని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రామన్న రాఘవేంద్ర గౌడ్,మాజీ కౌన్సిలర్లు కౌడే మహేష్ కురుమ, చీర్ల రమేష్ కురుమ, వేముల రంజిత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎన్నికల సిబ్బంది మరియు డివిజన్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించాలి

**ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించాలని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. పి ఆర్ టి యు టి ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మేడ్చల్ జెడ్ పి ఎస్ బాలుర పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి హాజరై మాట్లాడుతూ మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా దాదాపు 650 మంది ఉపాధ్యాయులు అవసరమని వారిని కేటాయించి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. పి ఆర్ టి యు టి ఎస్ సంఘం రాష్ట్రంలో 72,000 సభ్యత్వం కలిగిన అతిపెద్ద సంఘమని ఉపాధ్యాయుల సంక్షేమ కోసం సమస్యల సాధనలో ముందుంటుందని తెలిపారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా సిపిఎస్ ను రద్దు చేయాలని, నూతన పిఆర్ సి అమలు చేయాలని, హెల్త్ కార్డులు వెంటనే అమల్లోకి వచ్చే విధంగా చూడాలని, 2003 డీఎస్ సి వారికి పాత పెన్షన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.దశలవారీగా సమస్యలు పరిష్కరించుకుంటే ప్రభుత్వంపై ఉద్యమానికి వెనకాడబోమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు టీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి, పత్రిక సంపాదకవర్గ సభ్యులు పిచ్చి రెడ్డి, మేడ్చల్ మండల అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రజిత, సంఘ బాధ్యులు రామ్నాథ్ రెడ్డి , నరేందర్ గౌడ్ విజయలక్ష్మి జ్యోతి, వెంకటయ్య పాల్గొన్నారు.

## మద్యం మత్తులో పాఠశాల పిల్లలను తీసుకెళ్తున్న ఆటో డ్రైవర్ అరెస్ట్

**ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీల్లో గుర్తింపు**








హైదరాబాద్(ప్రశ్న న్యూస్) పాఠశాల విద్యార్థుల భద్రతను పణంగా పెడుతూ, మద్యం మత్తులో ఆటో నడుపుతున్న ఒక డ్రైవర్‌ను హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీల్లో చాకచక్యంగా పట్టుకున్నారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, గోషామహల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోషామహల్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ సమీపంలో జూన్ 24 ఉదయం 08:00 గంటల నుండి పాఠశాల బస్సులు, స్కూల్ ఆటోలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ట్రాఫిక్ సబ్-ఇన్‌స్పెక్టర్ జగదీష్, హోంగార్డులు హెచ్.జి 7311 కిరణ్ కుమార్, హెచ్.జి 4506 సురేష్‌లతో కలిసి ఈ తనిఖీలు చేపట్టారు.ఈ క్రమంలో ఉదయం 08:37 గంటల సమయంలో అబిడ్స్‌లోని 'స్లేట్ స్కూల్'కు చెందిన ఆరుగురు విద్యార్థులతో వెళ్తున్న టీఎస్ 12 యూఏ 9230 నెంబర్ గల ఆటో రిక్షాను పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఆటో డ్రైవర్ షేక్ ఇస్మాయిల్ (35) ప్రవర్తనపై అనుమానం రావడంతో అతనికి బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో 60 ఎంజి/100 ఎంఎల్ రీడింగ్ నమోదైంది. దీనితో అతడు మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు ఖరారైంది.ఈ విషయాన్ని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన ట్రాఫిక్ సిబ్బంది. విద్యార్థులను సురక్షితంగా దించి, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం డ్రైవర్‌ను గోషామహల్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. దీనిపై గోషామహల్ లా అండ్ ఆర్డర్ పోలీసులు డ్రైవర్ షేక్ ఇస్మాయిల్‌పై క్రైమ్ నెం. 227/2026, యు /ఎస్ 125 బి ఎన్ ఎస్, సెక్షన్ 185(ఎ) ఎంవి యాక్ట్, 130/177 ఎం.వి యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.పాఠశాల పిల్లలను రవాణా చేసే వాహనాల డ్రైవర్లు రవాణా నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, ఎలాంటి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనాలు నడపరాదని, విద్యార్థుల భద్రత మాకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని

# ఎమ్మార్వో ఇంట్లో వజ్రాలు.. అవినీతి గుట్టలు

- ప్రభుత్వ భూములపై కన్నేసి కోట్లకు పడగలెత్తుతున్న రెవెన్యూ మాఫియా.?
- లంచం కేసులో చిక్కిన సబ్-రిజిస్ట్రార్ సుచరిత ఇంట్లో కోట్ల అక్రమ ఆస్తులు వెలుగులోకి
- ప్రభుత్వ భూములను కబ్జాదారులకు కట్టబెడుతున్న ఎమ్మార్వోలు, ఆర్డీవోలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజల భూములను కాపాడాల్సిన అధికారులే భూ దందాలకు అండగా నిలిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో తాజాగా వెలుగులోకి వచ్చిన ఏసీబీ కేసు మరోసారి స్పష్టం చేసింది. రూ.3 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడి ఇప్పటికే సస్పెండ్ అయిన సబ్-రిజిస్ట్రార్ తుమ్మకొమ్మ సుచరితపై ఇప్పుడు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదవడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.ఏసీబీ అధికారులు నిర్వహించిన సోదాల్లో బయటపడిన ఆస్తుల వివరాలు చూసి ప్రజలు విస్తుపోతున్నారు. సిద్దిపేటలో 2.17 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లో మూడు ఫ్లాట్లు, రెండు ప్లాట్లు, ఖరీదైన వోక్స్‌వ్యాగన్, హ్యుందాయ్ క్రెటా కార్లు, రూ.1.2 కోట్ల విలువైన బంగారం-వజ్రాభరణాలు, రూ.12 లక్షల నగదు, రూ.38 లక్షల బ్యాంకు డిపాజిట్లు గుర్తించారు. ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ రూ.5.05 కోట్లుగా ఏసీబీ అంచనా వేసింది.

### లంచాలు లేకుండా ఫైళ్లు కదలవా.?

రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల పనితీరుపై ఇప్పటికే అనేక అవినీతి విమర్శలు ఉన్నాయి. భూ రికార్డుల మార్పులు, వారసత్వ నమోదు, ప్రభుత్వ భూముల రక్షణ, రిజిస్ట్రేషన్ల ప్రక్రియల్లో కొందరు అధికారులు లంచాలను అలవాటుగా మార్చుకున్నారనే ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. చిన్న పని నుంచి పెద్ద భూ వ్యవహారం వరకు భారీ మొత్తాలు డిమాండ్ చేస్తున్నారనే ఫిర్యాదులు ప్రజల నుంచి వస్తూనే ఉన్నాయి.

### ప్రభుత్వ భూములే లక్ష్యమా.?

ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాలు, పార్కుల స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నప్పటికీ వాటిని అడ్డుకోవాల్సిన కొందరు అధికారులు మౌనం వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. భూ దందాలకు అండగా నిలిచి కోట్ల రూపాయలు సంపాదిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఉన్నత అధికారుల పాత్రపై ప్రజలలో ప్రశ్నలు తలెత్తుతున్నాయి. క్రింది స్థాయి అధికారులు కోట్ల ఆస్తులు కూడబెట్టగలిగితే సంబంధిత వ్యవస్థలో పర్యవేక్షణ ఎక్కడ జరిగిందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కలెక్టర్ల దృష్టికి వెళ్లిన వాళ్లు కూడా మౌనం వహించడం జరుగుతుందని కొన్ని కేసులలో కలెక్టర్లు కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల అవినీతిపై ఫిర్యాదులు, ఆరోపణలు, అక్రమాల సమాచారం ఉన్నప్పటికీ సంబంధిత శాఖ మంత్రులు కూడా ఎందుకు ముందస్తు చర్యలు తీసుకోలేదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న ఉన్నతాధికారుల పాత్రపైనా విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు.

### అవినీతిపై ఉక్కుపాదం ఎప్పుడు.?

ప్రజల కష్టార్జిత సంపదను దోచుకుంటూ అవినీతితో విలాసవంతమైన జీవితం గడుపుతున్న ప్రభుత్వ అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని సామాన్యులు డిమాండ్




చేస్తున్నారు. ఒక్కొక్క కేసులో ఒక్కొక్క అధికారి అవినీతి చూసి ప్రజలు ఆందోళన చెందుతున్నారు కిందిస్థాయి అధికారులే ఇలా కోట్లు సంపాదిస్తే ఇక ఉన్నత అధికారుల ఆక్రమాస్తులు ఎంత తీవ్రస్థాయిలో ఉన్నాయో.? వాటిని బయటపడుతున్న కోట్ల ఆస్తులు ప్రభుత్వ వ్యవస్థలో అవినీతి ఎంత లోతుగా పాతుకుపోయిందో చూపిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవినీతి అధికారులపై వేగవంతమైన విచారణ, ఆస్తుల స్వాధీనం, కఠిన శిక్షలే ఇలాంటి అవినీతి అధికారుల దోపిడీకి చెక్ పెట్టగలవని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు.

- వార్డు, జిల్లా సభల నిర్వహణతో సమస్యల గుర్తింపు
- జిల్లా ప్రత్యేక అధికారి వికాస్ రాజ్

మేడ్చల్( ప్రశ్న న్యూస్ )నిత్యం ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ మానవీయ కోణంలో పరిష్కరిస్తూ అర్హులైన వారందరికి రాష్ట్ర ప్రభుత్వం అందించే అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక జిల్లా ప్రత్యేక అధికారి వికాస్ రాజ్ అన్నారు. గురువారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్లో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ కోటిరెడ్డి లతో కలిసి జిల్లా ప్రత్యేక అధికారి వికాస్ రాజ్,సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు జిల్లా కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.సంక్షేమ పథకాలను అర్హులందరికీ అమలు చేయడమే కాక ప్రజల సమస్యలను గుర్తించి సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని జిల్లా ప్రత్యేక అధికారి, రోడ్లు భవనాల శాఖ, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, వికాస్ రాజ్ అన్నారు.99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా వార్డు సభల నిర్వహణతో కిందిస్థాయి నుంచి కూడా ప్రజల సమస్యలను గుర్తించడమే కాక ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులు గురించి ఆయా శాఖల అధికారులు వివరించడం జరిగిందన్నారు. ప్రభుత్వం రూపొందించి 10 థీములతో కూడిన కార్యక్రమాల షెడ్యూల్ ప్రకారం ఆయా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు విజయవంతం కావడం జరిగిందని పేర్కొన్నారు. వివిధ శాఖల్లో గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించుకుంటూ ముందుకెళ్లాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును నిరంతర ప్రక్రియగా పేర్కొంటూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక స్ఫూర్తిని భవిష్యత్తులోనూ కొనసాగించాలని సూచించారు. కొన్ని అంశాలలో వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి శాఖలో ఏమైనా సమస్యలను గుర్తించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే కాక ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు 99 రోజుల యాక్షన్ ప్లాన్ దోహద పడిందన్నారు. ఈ వర్షాకాలంలో నీరు నిలువ ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి తీసుకున్న కార్యాచరణ ప్రణాళికల పై సైబరాబాదు, మల్కాజిగిరి అడిషనల్ కమీషనర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏలాంటి ప్రమాదాలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రత్యేక అధికారి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగిందన్నారు. మార్చి ఆరవ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రభుత్వ కార్యాలయాల్లో పాత ఫైల్స్ క్లియరెన్స్, పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించామన్నారు. 99 రోజుల షెడ్యూల్ ప్రకారం వివిధ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల గురించి తెలియజేశారు. బాల్యవివాహాలతో బతుకు ఆగం అనే నినాదంతో జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు. పోక్సో కేసులను తగ్గించేందుకు కట్టుదిట్టమైన చర్యలను చేపట్టామన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ వారోత్సవాల్లో బ్లాక్ స్పాట్స్ గుర్తించి వాటిని మరమ్మత్తులు చేపట్టడం, రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల పై జిల్లా వ్యాప్తంగా ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా , సైబెరాబాద్, మల్కాజిగిరి మునిసిపల్ కార్పొరేషన్ లు, ఉద్యానవన, క్రీడలు యువజన సర్వీసులు, సంక్షేమ, అటవీ, తదితర శాఖల ఆధ్వర్యంలో 99 రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహించిన కార్యక్రమాల గురించి కూడా ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వివరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేసిన తమ కార్యక్రమాల గురించి పి.పి.టి





ద్వారా వివరించారు. తదనంతరం, జిల్లా ప్రత్యేక అధికారి మేడ్చల్ -- మల్కాజిగిరి జిల్లా అధికారులందరినీ సమీక్షించి, 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుపై సమగ్ర సాధన నివేదికలను సంకలనం చేసి సమర్పించాలని అన్ని విభాగాలను ఆదేశించారు. అలాగే ఖచ్చితమైన సమాచారం, విజయ గాథలు, ఉత్తమ పద్ధతులు, ఛాయాచిత్రాలు, ఇతర సహాయక పత్రాలను సమర్పించాలని నొక్కిచెప్పారు. పై అంశాలతో కూడిన సరైన డాక్యుమెంటేషన్‌తో సమగ్ర నివేదికను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్లు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఎటిఎం క్యాష్ వ్యాన్ డ్రైవర్ ఘరానా చోరీ

# కొడుకులతో కలిసి స్కెచ్

### రూ. 14.55 లక్షలు స్వాధీనం చేసుకున్న టాస్క్ ఫోర్స్



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కేందుకు కన్న కొడుకులతో కలిసి ఓ క్యాష్ వ్యాన్ డ్రైవర్ వేసిన ఘరానా దొంగతనం ప్లాన్‌ను హైదరాబాద్ కమిషనర్స్ టాస్క్ ఫోర్స్ (చార్మినార్ జోన్), ఐఎస్ సదన్ పోలీసులు ఉమ్మడిగా ఛేదించారు. ఎటిఎంలో నింపాల్సిన రూ. 17 లక్షల నగదుతో పరారైన డ్రైవర్‌తో పాటు అతని ఇద్దరు కొడుకులను పోలీసులు గురువారం నాడు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ. 14,55,000/- ల నగదు, నేరానికి ఉపయోగించిన ప్యాషన్ ప్లస్ బైక్, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను చార్మినార్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఖరే కిరణ్ ప్రభాకర్ వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం, జగిత్యాల జిల్లా మల్యాల మండలం గొర్రెగుండం గ్రామానికి చెందిన చింతల శ్రీనివాస్ అలియాస్ శ్రీను (42) హైదరాబాద్‌లోని ఫేరోజ్‌గూడలో ఉంటూ 'క్లియర్డ్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్' సంస్థలో క్యాష్ వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతని ఇద్దరు కొడుకులు చింతల అనీష్ అలియాస్ జాన్ (22), చింతల జశ్వంత్ (20) లు ఉప్పల్ పీర్జాదిగూడలో ఉంటూ స్విగ్గీ డెలివరీ బాయ్స్‌గా పనిచేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న శ్రీనివాస్ తాను పనిచేసే చోటే నగదు చోరీ చేయాలని పథకం పన్నాడు. ఈ ప్లాన్ గురించి తన ఇద్దరు కొడుకులకు వివరించి, వారిని కూడా ఇందులో భాగస్వాములను చేశాడు. పథకం ప్రకారం జూన్ 23న మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎడిబజార్ ఎస్‌బీఐ ఎటిఎం వద్దకు నగదు నింపే వాహనం చేరుకుంది. మిగిలిన సిబ్బంది ఎటిఎం మిషన్ లో నగదు నింపే పనిలో నిమగ్నమవ్వగా డ్రైవర్ శ్రీనివాస్ క్యాష్ వ్యాన్ నుండి రూ. 17 లక్షలు ఉన్న నగదు బ్యాగ్‌ను తీసుకుని పక్కనే ఉన్న సందులోకి పారిపోయాడు. అప్పటికే ప్లాన్ ప్రకారం అక్కడ ప్యాషన్ ప్లస్ బైక్‌తో సిద్ధంగా ఉన్న పెద్ద కొడుకు అనీష్, తండ్రిని ఎక్కించుకుని అక్కడి నుండి వేగంగా పరారయ్యాడు. కొడుకుకు పది లక్షల వాటా,అక్కడి నుండి తప్పించుకున్న తండ్రీకొడుకులు పీర్జాదిగూడ ప్రాంతంలో చిన్న కొడుకు జశ్వంత్‌ను కలిశారు. చోరీ చేసిన సొమ్ములో నుండి రూ. 10 లక్షల నగదును భద్రపరచమని జశ్వంత్‌కు ఇచ్చారు. మిగిలిన రూ. 7 లక్షల నగదును శ్రీనివాస్, అనీష్‌లు తమ వద్ద ఉంచుకుని వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ అందులో కొంత మొత్తాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేశారు. క్యాష్ కస్టోడియన్ బంటుపల్లి సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐఎస్ సదన్ పోలీసులు క్రైమ్ నెం. 160/2026, యు/ఎస్ 303(2) బి ఎన్ ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### సీసీటీవీ ఫుటేజ్, టెక్నికల్ ఎవిడెన్స్‌తో పట్టుకున్న పోలీసులు..



ఘటనా స్థలంలోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించిన పోలీసులకు, డ్రైవర్ శ్రీనివాస్ నగదు బ్యాగ్‌తో వేరే వ్యక్తి బైక్‌పై పారిపోతున్న దృశ్యాలు లభ్యమయ్యాయి. సాంకేతిక ఆధారాల సహాయంతో బైక్ నడుపుతున్నది అతని కొడుకు అనీష్ అని గుర్తించారు. గురువారం మధ్యాహ్నం 2:00 గంటల ప్రాంతంలో నమ్మదగిన సమాచారంతో టాస్క్ ఫోర్స్, ఐఎస్ సదన్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి బోయిన్‌పల్లిలోని 'బ్రోస్ బాయ్స్ హాస్టల్' సమీపంలో శ్రీనివాస్, అనీష్‌లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు నేరాన్ని అంగీకరించారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు మధ్యాహ్నం 3:30 గంటలకు పీర్జాదిగూడలో ఉన్న చిన్న కొడుకు జశ్వంత్‌ను కూడా అరెస్ట్ చేసి, అతని వద్ద దాచిన నగదును, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం న్యాయస్థానానికి తరలించారు.

టాస్క్ ఫోర్స్ అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాసరావు పర్యవేక్షణలో సంతోష్ నగర్ ఏసీపీ టి. సుఖ్‌దేవ్ సింగ్, చార్మినార్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్. సైదాబాబు, ఐఎస్ సదన్ ఇన్‌స్పెక్టర్ జి. నాగరాజు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ బి. సాయి ప్రకాష్ గౌడ్, సబ్-ఇన్‌స్పెక్టర్లు కె. రామారావు, ఎం. మహేష్, ఎం. మధు సిబ్బంది ఈ కేసును చాకచక్యంగా ఛేదించారు.

# బోయినిపల్లి మోడల్ స్కూల్‌లో పీజీటీ (ఫిజిక్స్) పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినపల్లి మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్/ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ (ఫిజిక్స్) పోస్టును గంటల వారీ పారితోషికంపై భర్తీ చేయనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎరువ రఘునాథ్ తెలిపారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఫిజికల్ సైన్స్ బోధించేందుకు ఎం.ఎస్సీ (ఫిజిక్స్)తో పాటు బి.ఎడ్‌లో ఫిజికల్ సైన్స్ మెథడాలజీ పూర్తి చేసిన అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలతో జూన్ 29న ఉదయం 10 గంటలకు బోయినిపల్లిలోని తెలంగాణ మోడల్ స్కూల్ / జూనియర్ కళాశాలలో నిర్వహించే డెమోకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

# ఓటరు సవరణపై అపోహలు వద్దు

**-బీజేపీ సీనియర్ నాయకులు పొట్ట ఆంజనేయులు**

**-అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును కాపాడుకోవాలి**

**-పొట్ట ఆంజనేయులు పిలుపు**



కీసర (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో జూన్ 25 నుండి ప్రారంభం అయిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని బీజేపీ సీనియర్ నాయకులు పొట్ట ఆంజనేయులు కోరారు. ఈ సవరణ కార్యక్రమం జూలై 24 వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పొట్ట ఆంజనేయులు మాట్లాడుతూ, ఓటరు జాబితా నుండి అక్రమ ఓట్లను తొలగించడం ఎంత ముఖ్యమో, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకోవడం అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. అవసరమైతే సవరణలు చేసుకోవాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, పేర్ల సవరణలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు తన పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసుకోవాలని ఆయన కోరారు. ప్రభుత్వం నియమించిన బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యుమరేషన్ పత్రాలను అందజేస్తారని తెలిపారు. ఆ పత్రాలను ఎలా నింపాలో తెలియని పక్షంలో అధికారులను అడిగి తెలుసుకొని జాగ్రత్తగా పూరించాలని సూచించారు. బీఎల్వోలు ఇచ్చే రెండు పత్రాలలో ఒకదానిని పూర్తిగా నింపి వారికి అందజేయాలని, రెండవ పత్రాన్ని రశీదుగా ప్రజలు తమ వద్దే భద్రపరుచుకోవాలని ఆయన వివరించారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చూసేందుకు, అపోహలకు తావివ్వకుండా ఈ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని ఆంజనేయులు పిలుపునిచ్చారు.

## ఇందిరా మహిళా శక్తి పథకంతో

# మహిళలకు ఆర్థిక భరోసా



కీసర(ప్రశ్న న్యూస్) రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నట్లు దమ్మాయిగూడ నాలుగో వార్డ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దిలీప్ సాల్వే అన్నారు. గురువారం కీసర సర్కిల్ దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని బండ్లగూడలో ఇందిరా మహిళా శక్తి తిరునాళ్ల కార్యక్రమాన్ని నిర్వహించి మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని, మహిళలు అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) ఓటర్ల జాబిత ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా గురువారం బిఎల్ఓ లు ఇంటింటికి అందిస్తున్న ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని తిమ్మాపూర్, ఎదులాబాదులలో జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మీకు ఎన్ని ఎన్రోల్ మెంట్ పత్రాలు ఇచ్చారని, ఒక్కొక్కరికి ఎన్ని ఎన్రోల్ మెంట్ పత్రాలు ఇస్తున్నారని, ఎన్రోల్ మెంట్ యాప్ ద్వారా అప్ లోడ్ చేసే ప్రక్రియను బిఎల్ ఓ ను అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్కరికి రెండు పత్రాలు అందజేస్తున్నామని, సెల్ ఫోన్ లో క్యూఆర్ కోడ్ ద్వారా అప్ లోడ్ చేస్తున్నామని బిఎల్ ఓలు వివరించారు. ఈ పర్యటనలో కీసర ఆర్డిఓ వెంకట్ రెడ్డి, శామీర్ పేట్ తహసీల్దారు యాదగిరి రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలో "2"అంతర్రాష్ట్ర నేరస్తుల అరెస్ట్: డిసిపి వైభవ్

**- రెండు దేశీయ పిస్టల్స్, 7 బుల్లెట్లు,కారు స్వాధీనం**

**- అక్రమ ఆయుధాల కేసులో ఇద్దరు అరెస్టు:టాస్క్-ఫోర్స్ డిసిపి వైభవ్**






హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (టాస్క్‌ఫోర్స్) వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ వెల్లడించిన వివరాల ప్రకారం, జూబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులతో కలిసి నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఇద్దరు అంతర్రాష్ట్ర నేరస్తులను అరెస్ట్ చేశారు. నిందితులు ముదస్సిర్ హుస్సేన్ అలియాస్ షా బాబా (24), హైదరాబాద్‌కు చెందిన కార్ డీలర్ కాగా, అమీర్ ఖాన్ (26) మహారాష్ట్ర రాష్ట్రంలోని నాందేడ్‌కు చెందిన లారీ డ్రైవర్‌గా పోలీసులు గుర్తించారు. నిందితుల వద్ద నుంచి రెండు దేశీయ తయారీ పిస్టల్స్, 7 బుల్లెట్లు, టిఎస్ 23ఎఫ్ 1701 నంబరు గల బాలెనో కారు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మొత్తం విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని పోలీసుధికారులు తెలిపారు. విచారణలో భాగంగా ముదస్సిర్ హుస్సేన్ గతంలో ముంబైలో పనిచేసి అనంతరం వాహనాల కొనుగోలు, విక్రయాల వ్యాపారంలోకి ప్రవేశించినట్లు తెలిసింది. ఈ క్రమంలో మహారాష్ట్రకు చెందిన నేరచరిత్ర కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పరుచుకుని దోపిడీలు, అపహరణలు వంటి నేర కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు పోలీసులు వెల్లడించారు. కర్ణాటకలో జరిగిన దోపిడీ కేసుతో పాటు మహారాష్ట్రలో ఒక వ్యాపారవేత్త అపహరణ కేసులో కూడా అతని ప్రమేయం ఉన్నట్లు తెలిపారు. అమీర్ ఖాన్ కూడా మహారాష్ట్రలో పలు క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు విచారణలో తేలిందని అధికారులు పేర్కొన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో బాలెనో కారులో సంచరిస్తూ నేరానికి పాల్పడేందుకు యత్నిస్తున్నారని తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు మెహ్ఫిల్ హోటల్ సమీపంలో వాహనాన్ని అడ్డగించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. ముదస్సిర్ హుస్సేన్‌పై కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల్లో దోపిడీ, ఆయుధాల చట్ట ఉల్లంఘనలకు సంబంధించిన కేసులు నమోదై ఉండగా, అమీర్ ఖాన్‌పై మహారాష్ట్రలో పలు కేసులు, తెలంగాణలో మరో కేసు నమోదై ఉన్నట్లు వెల్లడించారు. ఈ ఆపరేషన్‌ను జూబ్లీహిల్స్ జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ యాదేందర్, ఎస్ఐ మొహమ్మద్ జాహెద్, సిబ్బంది మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల సహకారంతో విజయవంతంగా నిర్వహించినట్లు డీసీపీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ విలేకరుల సమావేశంలో తెలిపారు.

### అల్వాల్ లో నకిలీ"డబుల్ బెడ్ రూం"ఇళ్ల పట్టాలు పేరుతో మోసం:

అల్వాల్ పీఎస్ పరిధిలో రెండు పడక గదుల ఇళ్లను ఇప్పిస్తామంటూ అమాయక ప్రజలను మోసం చేస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు మల్కాజ్ గిరి డీసీపీ శ్రీధర్ తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న పుష్పలత ఆమె కుమారుడు గోపీనాథ్ సహా మహేందర్ సింగ్ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల నుండి 79 నకిలీ రెండు పడకల ఇంటి ధృవపత్రాలతో పాటు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ముగ్గురిని అరెస్టు కాగా మరో నలుగురు పరారీలో ఉన్నట్లు డిసిపి శ్రీధర్ పేర్కొన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న జయరాజ్ తిరుమలగిరికి చెందిన పుష్పలతతో కలిసి అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకొని రెండు పడక గదుల ఇళ్లను ఇప్పిస్తామని మోసానికి పాల్పడ్డట్లు పోలీసులు తెలిపారు. జయరాజ్ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ పైరవీలు చేస్తూ జీవనం సాగిస్తుండేవాడని, పుష్పలత గతంలో కలెక్టరేట్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ విభాగంలో విధులు నిర్వహించేదని పోలీసులు వెల్లడించారు. వీరిద్దరూ కలిసి రెండు డబుల్ బెడ్ రూం ఇల్లు ఇప్పిస్తామని అల్వాల్ లో ప్రజలను నమ్మిస్తూ వారి నుండి పలు దఫాలుగా నగదు వసూలు చేసినట్లు తెలిపారు. 2023 నుండి ఈ వ్యవహారంకొనసాగుతుండగా ఒక్కొక్కరి నుండి 50 వేల నుండి లక్ష రూపాయల వరకు వసూలు చేసి ఆ డబ్బులతో చిరాస్థులు ఆస్తులు కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఇళ్ల కోసం ప్రభుత్వ కార్యాలయాలలో సంప్రదించగా అధికారులు వాస్తవాలు వెల్లడించడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు అల్వాల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రెండు పడక గదుల ఇళ్లకు డబ్బులు ఇచ్చిన వారిలో 99 మంది ఉన్నట్లు గుర్తించామని పోలీసులు చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా ప్రభుత్వమే పథకాలు అందజేస్తుందని దళారులను నమ్మి మోసపోవద్దని ప్రజలకు డిసిపి శ్రీధర్ సూచించారు. బేగం పేట డివిజన్ ఏసిపి గోపాల కృష్ణ మూర్తి, అల్వాల్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ వీరబాబు, ఎస్సై చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు.

# మంథనిలో కొన్ని ఫర్టిలైజర్ షాపుల ఇష్టా రాజ్యం...

**- వ్యవసాయ శాఖ అధికారుల తనిఖీ లు కరువు...**

**- పంట పండించిన రైతుకు మిగిలేది అప్పుల కుప్పలే దిక్కు...?**

**- రెక్క ఆడితే గాని డొక్కా ఆడని చిన్న సన్న కారు రైతుల పరిస్థితి**

**- లక్షలకు పైగా పడగలేత్తుతున్న కొందరు వ్యాపారులు,దళారులు...**

**- విత్తనాల ప్రారంభం నుండి పత్తి,వరి అమ్మే వరకు అన్నింట్లో దళారులే**

**- రియల్ ఎస్టేట్, వ్యవసాయ భూముల కొనుగోలు...**

**- లావాదేవీల పై నిఘా కరువు..? - అంతా ఒక్కే ఖాతా నుండి లావాదేవీలు...**

**- దర్జాగా ప్రభుత్వ పథకాలు పొందుతూ... - వ్యాపారుల, దళారుల ఆస్తులపై టాస్క్ పోర్స్ , ఇన్కమ్ టాక్స్ అధికారులు నిఘా పెట్టాలి...? - , ప్రజా సంఘాల డిమాండ్.**




మంథని (ప్రశ్న న్యూస్) మంథని మండలంలోని కొన్ని ఫెర్టిలైజర్ షాపుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా అమ్మకాలు జరుపుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులు పంటలు వేసేందుకు ఫెర్టిలైజర్ దుకాణాలలో పత్తి వరి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. అయితే కొన్ని షాపుల యజమానులు మాత్రం ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వ నియమ నిబంధనలను బేకతార్ చేస్తున్నారు. అయితే కొందరు రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఫెర్టిలైజర్ యజమానులు అధిక లాభం వచ్చే విత్తనాలను ఎరువు మందులను రైతులకు అంటగడుతున్నారు. దీంతో రైతులు కొన్నేళ్లుగా నిండా మునుగుతున్నారు. గ్రామాల్లో ఉన్న కొన్ని ఫర్టిలైజర్ షాపులు అయితే అడ్డా గోలుగా రైతుల నుండి దోచుకుంటున్నారు. మంథని మండలంలో ఉన్న కొన్ని ఫర్టిలైజర్ నిర్వహకుల సంపాదన చూస్తూనే ఏ స్థాయిలో సంపాదిస్తున్నారో తెలుస్తుంది. పంట పండించిన రైతుకు మిగిలిలేది అప్పుల కుప్పలే దిక్కు..? రెక్క ఆడితే గాని డొక్కా ఆడని చిన్న సన్న కారు రైతుల పరిస్థితి ఉంది. కొందరు వ్యాపారులు దళారులు అయితే లక్షలాది పైగా డబ్బులు సంపాదిస్తూ... రియల్ ఎస్టేట్, వ్యవసాయ భూముల కొనుగోలు... ఇతర కొనుగోళ్లు చేస్తున్నారు. తప్పుడు లెక్కలు చూపిస్తు.. ప్రభుత్వానికి కట్టే టాక్స్ నుండి తప్పించు కుంటున్నారు. అయితే లావాదేవీలపై నిఘా కరువు..? అయ్యింది. వివిధ మార్గాలద్వారా వచ్చిన డబ్బులను ఫర్టిలైజర్ ఖాతా నుండే చూపిస్తూన్నారు. కొందరు వ్యాపారులు ప్రభుత్వ పథకాలు కూడా దర్జాగా అనుభవిస్తున్నారు. అయితే జిల్లా వ్యవసాయ మండల, అధికారుల నిఘా కరువు అయ్యింది. మంథని లో వ్యాపారుల, దళారుల ఆస్తులపై టాస్క్ పోర్స్,, ఇన్కమ్ టాక్స్ అధికారులు నిఘా పెట్టాలని రైతులు కోరుతున్నారు.

# సర్ కు మంచి స్పందన వస్తుంది

**గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పారీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్**



మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) నేటి నుండి ప్రారంభమైన సర్ కు మంచి స్పందన వస్తుందని ప్రతి ఒక్కరూ అందుబాటులో ఉండి బి ఎల్ వో లకు బిఎల్ఎ లకు సహకరించాలని గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్ కోరారు, ప్రతి ఒక్కరికి ఓటు చాలా అవసరం బి ఎల్ ఓ లు లు ఇచ్చినటువంటి ఫార్మ్ ను పూర్తిగా చదివిన తర్వాత నింపాలని సాయి పేట శ్రీనివాస్ అన్నారు, మీకు అర్థం కాకపోతే బిఎల్ఓ లను, బిఎల్ఎ లను సంప్రదించిన తర్వాత ఫామ్ లను నింపాలని ఆయన సూచించారు, రెండు ఫామ్ లు ఇస్తారు కాబట్టి రెండు నింపిన తర్వాత ఒక ఫామ్ మన దగ్గర పెట్టుకొని మరొక ఫామ్ బిఎల్ఓ లకు ఇవ్వాలని కూడా ఆయన ఓటర్లకు సూచించారు, ఫామ్ నింపే తర్వాత మన దగ్గర పెట్టుకొని బూతు లెవల్ ఆఫీసర్కు ఇవ్వకుంటే మన ఓటు కట్ అయ్యే ఛాన్స్ ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు కుండా భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ లబ్ధి కోసం ముంపు బాధితులను వాడుకోవద్దు: సీఐటీయూ

**- ముంపు గ్రామాల అభివృద్ధికి పెండింగ్ పరిహారాలు, ప్యాకేజీలు అందించాలి**

**- రాజకీయాలకు అతీతంగా బాధితుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడుదాం**

**సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి డిమాండ్**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) మల్లన్నసాగర్ ముంపు గ్రామాల అభివృద్ధి, బాధితుల సమస్యల పరిష్కారం కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, అధికారులు, గజ్వేల్ పట్టణ ప్రజలు కలిసి రావాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి పిలుపునిచ్చారు. స్థానిక విలేకరులతో మాట్లాడిన ఆయన, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముంపు గ్రామాల ప్రజలకు హామీలు ఇచ్చి గ్రామాలను ఖాళీ చేయించిందని, అయితే పూర్తి స్థాయిలో నష్టపరిహారం, ప్యాకేజీలు, కాలనీల్లో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. ముంపు బాధితుల పక్షాన మాట్లాడిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం అధికారంలో ఉన్నప్పటికీ, పెండింగ్ పరిహారాలు, ప్యాకేజీల చెల్లింపు, ఓపెన్ ప్లాట్లు మరియు కేటాయించిన ఇండ్ల రిజిస్ట్రేషన్ల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆరోపించారు. అలాగే, గతంలో ఎమ్మెల్యేగా ముంపు గ్రామాలకు ప్రాతినిధ్యం వహించిన ప్రస్తుత బీజేపీ పార్లమెంట్ సభ్యుడు కూడా బాధితుల సమస్యల పరిష్కారానికి తగిన కృషి చేయడం లేదని అన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలు పరస్పర విమర్శలతో రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నాయని, ఆ రాజకీయాలకు ముంపు గ్రామాల ప్రజలు బలికావద్దని సూచించారు. ఇప్పటికైనా అన్ని వర్గాలు ముంపు బాధితుల పక్షాన నిలబడి వారి న్యాయమైన డిమాండ్ల సాధనకు కృషి చేయాలని కోరారు. ముంపు గ్రామాల ప్రజల గృహ నిర్మాణ అనుమతులు, పన్ను మినహాయింపులు వంటి అంశాలను చట్టబద్ధంగా పరిష్కరించాలని, దొడ్డిదారిన వసూళ్లు చేయడం లేదా ప్రజల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలు చేయవద్దని హెచ్చరించారు. ఏ సమస్య ఉన్నా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. ముంపు గ్రామాల యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కాలనీల్లో తాగునీటి సరఫరా, వీధి దీపాలు, మురుగు కాలువల శుద్ధి, రోడ్ల నిర్మాణం వంటి కనీస మౌలిక సదుపాయాలపై మున్సిపల్ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

## నర్సాపూర్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమష్టిగా కృషి చేయాలి

**కలెక్టర్ ప్రతి మాసింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ అభివృద్ధి పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలు క్షేత్రస్థాయిలో తెలుసుకొని పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని సూచించారు.వర్షాకాలం నేపథ్యంలో వరదల నివారణ చర్యలు, ఘన వ్యర్థాల నిర్వహణ, పట్టణ పరిశుభ్రత, మొక్కలు నాటడం, ఎస్ఐఆర్ ప్రక్రియ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో నర్సాపూర్ ఆర్డీవో రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్ చెరుకు సాయికుమార్ ,తాసిల్దార్ శ్రీనివాస్, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారమే ఏఐఎస్బీ లక్ష్యం

- రాష్ట్ర ఉపాధ్యక్షులు : అతికం రాజశేఖర్ గౌడ్
- ఘనంగా ఏఐఎస్‌బీ 76వ ఆవిర్భావ దినోత్సవం
- కేక్ కట్ చేసి విద్యార్థులకు నోట్ బుక్స్,పెన్నులు పంపిణీ



కరీంనగర్ (ప్రశ్న న్యూస్) ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ (ఏఐఎస్‌బీ) 76వ ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. అలాగే జెండా ఆవిష్కరించి ఏఐఎస్‌బీ సంస్థ లక్ష్యాలు, అవసరాన్ని విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణలో విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కేజీ నుంచి పీజీ వరకు విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. దేశ విద్యావ్యవస్థ వైఫల్యం నీట్ పరీక్ష నిర్వహణతో స్పష్టమైందని విమర్శించారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో ఏఐఎస్‌బీ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాల సాధన కోసం ఏర్పాటైన ఏఐఎస్‌బీ, భవిష్యత్తులో కూడా ఆయన స్ఫూర్తితో విద్యార్థుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంశీ, రాహుల్, సురేష్, మహేష్, వేణు, శ్రేయస్, రఘు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై వెళ్లిన టీఆర్ఎస్ నేతలపై దాడి హేయమైన చర్య

- మంత్రి అనుచరుల దాడి అప్రజాస్వామికం
- దాడి ఘటనపై బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- గోదావరిలో అక్రమ ఇసుక తవ్వకాలపై విచారణ జరిపించాలి
- తెలంగాణ రక్షణ సేన రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి : మజీద్



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ములుగు జిల్లా, ఏటూరు నాగారం పరిధిలో గోదావరి నదిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను పరిశీలించేందుకు వెళ్లిన తెలంగాణ రక్షణ సేన నాయకులపై జరిగిన దాడిని తెలంగాణ రక్షణ సేన రాజన్న సిరిసిల్ల జిల్లా ఇంచార్జి మజీద్ తీవ్రంగా ఖండించారు.ఈ మేరకు గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, సీతమ్మసాగర్ మల్టీ పర్పస్ ప్రాజెక్టు ముంపు పేరుతో మంగపేట మండలం, వాడగూడెం ప్రాంతంలో గోదావరి నదిలో భారీ ఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు తెలంగాణ రక్షణ సేన నాయకులు అక్కడికి వెళ్లి పరిస్థితులను పరిశీలించేందుకు ప్రయత్నించారని తెలిపారు.అయితే క్వారీల వరకు వెళ్లకుండా అడ్డుకున్న కొందరు వ్యక్తులు నాయకులపై దాడికి పాల్పడటమే కాకుండా, వీడియోలు చిత్రీకరిస్తున్న సెల్‌ఫోన్లను లాక్కొని ధ్వంసం చేశారని ఆరోపించారు. అక్కడి నుంచి వెళ్లిపోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని బెదిరించారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, అక్రమాలను వెలుగులోకి తీసుకురావడానికి వెళ్లిన నాయకులపై దాడి చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని మజీద్ అన్నారు. ఘటనపై ప్రభుత్వం,సదరు జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోదావరిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలపై పారదర్శక విచారణ నిర్వహించి వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు.

# జంటనగరాల్లో 'ఎస్ఐఆర్' పై నాయకులు ఫోకస్

- ఖైరతాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్ నగర్ డివిజన్ వేల్మోటి పార్క్ లో ఈరోజు నుండి ప్రారంభమైన ఎస్ఐఆర్ (ఓటరు సవరణ ప్రక్రియ) పై బిఎల్ఏ లకు అవగాహన కల్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- అనంతరం విఠల్ వాడిలో ఎస్ఐఆర్ పై బిఎల్ఏ,బి ఎల్ వో లతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు
- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఎస్ఐఆర్ పై ప్రజలతో మీటింగ్





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) జంటనగరాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు బిజీ బిజీగా ఉన్నారు.ఏ వీధి చూసిన ఎమ్మెల్యే లు, మంత్రులు, అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిన్న గురువారం హైదరాబాద్ జిల్లా ఇంఛార్జ్, రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బి ఎల్ వో లు ఇచ్చే ఎన్యూమరేషన్ ఫారం నింపి బిఎల్ఏ లతో కలిసి ఇవ్వాలని ప్రజలకు సూచించారు. అలాగే 2002, 2025 ఓటరు జాబితా ఆధారంగా సవరణ ప్రక్రియ జరుగుతుందన్నారు. బి ఎల్ ఎ లు నిర్లక్ష్యంగా ఉంటే ఓట్లు తొలగిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు.ఈరోజు నుండి జూలై 24 వరకు జరిగే ఎస్ఐఆర్ లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్,ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రమణ గౌడ్ తదుతరలు పాల్గొన్నారు.

### మంత్రి పొన్నం ప్రభాకర్..


కేంద్ర ఎన్నికల కమిషన్ తెలంగాణ రాష్ట్రంలో ఓటరు సవరణ కార్యక్రమం చేపట్టింది ఇంటింటికి 2002 ,2025 ఓటరు లిస్ట్ ఆధారంగా ఎన్యూమరేషన్ ఫారం మీకు ఇస్తారు.ప్రజల దగ్గరకు బిఎల్వో,రాజకీయ పార్టీ నుండి బిఎల్ఎ వచ్చి ఓటరు సవరణ చూస్తారు.సరైన విధంగా నమోదు చేయాలి ఒక్క ఓటు కూడా పోకుండ జాగ్రత్త వహించాలని మంత్రి సూచించారు. హైదరాబాద్ లో రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో 35 వేల పోలింగ్ బూత్ లలో ఈ ప్రక్రియ జరుగుతుంది.తటస్థ ఓటు కింద తెలంగాణలో కోటి ఓట్లు పడ్డాయి.ఉదహరణకు ఉప ముఖ్యమంత్రి ఓటు కూడా తటస్థ కింద ఉంది.అలా అని ఓటు తొలగించినట్టు కాదు. బి ఎల్ ఏ లు అప్రమత్తంగా లేకపోతే ఈ ఓట్లు తొలగిపోయే అవకాశం ఉంటుంది.ఈరోజు నుండి జూలై 24 వరకు సవరణ ప్రక్రియ ఉంటుంది.మంత్రులు ఎమ్మెల్యేలు కూడా ఓటరు సవరణ చేయడానికి లేదు.బి ఎల్ ఏ లకు మాత్రమే ఉంది.ఓటు ప్రాథమిక హక్కు.ఓటు తొలగకుండా జాగ్రత్తగా ఉండాలి.ఓటరు సవరణ 2002 లో కూడా జరిగింది.ఏ ఒక్క అర్హత కలిగిన ఓటు తొలగిపోవద్దు అని చేర్చారు. ఎన్నికల కమిషన్ బీజేపీ అనుబంధ సంస్థగా మారి బెంగాల్, బీహార్ లలో లక్షల ఓట్లు తొలగించారు. అక్కడ ప్రభుత్వాలు పడిపోవడానికి కారణమయ్యారు. ఓటు మన ఆయుధం. ఓటు ఎవరికైనా వేసుకొని ఓటు ప్రజాస్వామ్యంలో మన హక్కు. అది కోల్పోవద్దు. ముఖ్యమంత్రి, టిపీసీసీ, ఎఐసిసి నాయకత్వం ఎమ్మెల్యే అందరూ సమన్వయం చేస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ గ్రామాల్లో 12 వేల గ్రామాల్లో 35 వేల పోలింగ్ బూత్ లలో బి ఎల్ ఏ లను ఏర్పాటు చేసింది.ఈ నెల 25 నుండి జూలై 24 వరకు ఎస్ఐఆర్ ప్రక్రియ జరగనుంది. ఒక ఓటు కూడా తొలగకుండా కాంగ్రెస్ పార్టీ బాధ్యత తీసుకుంది. స్వాతంత్రం కోసం పోరాడిన పార్టీ, రాజ్యాంగం పరిరక్షణకు కాపాడే పార్టీ. ప్రతి ఓటరు రెండు ఫోటోలు ఎన్యూమరేషన్ ఫారం కి అందించాలి. రోజు 50 ఫారాలు అప్లోడ్ చేయాలి. తెలంగాణ లో ఒక్క అర్హత కలిగిన ఓటు చూసుకునే బాధ్యత మన అందరిదీ, అదే కాంగ్రెస్ పార్టీ ది.

### ఒక్క ఓటు గల్లంతైనా మీ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది ఎమ్మెల్యే శ్రీ గణేష్..

భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25 నుండి జూలై 24 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చూసేందుకు కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో ప్రతి పోలింగ్ బూత్ వద్ద బిఎల్ఏ లతో హెల్ప్ డెస్కలను ఏర్పాటు చేయడం జరిగింది.ఇందులో భాగంగా వార్డు 2 లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్కను ఎమ్మెల్యే శ్రీగణేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ అనేది ప్రతి పౌరుడి ప్రాథమిక బాధ్యతని,18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని,మీ పేరు లిస్టులో ఉందో లేదో స్వయంగా చెక్ చేసుకోవాలని,ఏమైనా తప్పులు ఉంటే వెంటనే సరిచేయించుకోవాలని పిలుపునిచ్చారు.ఓటర్లు అప్రమత్తంగా లేకపోతే ఓటు గల్లంతు కావడంతో పాటు భవిష్యత్తులో వారి ఆధార్, రేషన్ కార్డులు, పాస్ పోర్ట్ లు రద్దయి,ప్రభుత్వ సంక్షేమ పథకాలకు కూడా అనర్హులవుతారని ఎమ్మెల్యే హెచ్చరించారు. అందుకే కాంగ్రెస్ పార్టీ తరపున బిఎల్ఏ లు నెల రోజుల పాటు ప్రతి ఇంటికి వచ్చి ఓటర్లకు అవగాహన కల్పిస్తారని, ఓటర్లందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. బిఎల్ఏలను ఉద్దేశించి మాట్లాడుతూ, మీరు అత్యంత అప్రమత్తంగా, బాధ్యతగా విధులు నిర్వహించాలని, ఒక్క అర్హుడి ఓటు కూడా మిస్ కాకూడదని,ఇది ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం మనం చేస్తున్న సేవని దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్ఐఆర్ కో ఆర్డినేటర్లు బద్రీనాథ్ యాదవ్, సంకి రవీందర్,వార్డు 2 కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,బిఎల్ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యూరియా అక్రమ వసూళ్లపై అధికారులు సీరియస్

## అక్రమ వసూళ్లు నిర్ధారణ.. డీలర్ లైసెన్స్ 10 రోజులు సస్పెన్షన్










గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలంలో యూరియా ఎరువుల విక్రయాల సమయంలో రైతుల నుంచి అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారంటూ ప్రచురితమైన ప్రజా ప్రశ్న కథనంపై వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. కథనంలో ప్రస్తావించిన అంశాలపై విచారణ చేపట్టిన అధికారులు అక్రమ వసూళ్లు జరిగినట్లు నిర్ధారించారు. యూరియా బస్తాపై నిర్ణీత ధర కంటే ఒక్కో బస్తాకు రూ.34 అదనంగా వసూలు చేస్తున్నారన్న రైతుల ఫిర్యాదుల నేపథ్యంలో సంబంధిత ఎరువుల విక్రయ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. విక్రయ రికార్డులు, బిల్లులు, రైతుల వాంగ్మూలాలను పరిశీలించిన అనంతరం అక్రమ వసూళ్లు జరిగినట్లు అధికారులు గుర్తించారు. దీంతో సంబంధిత డీలర్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకుని, అతని లైసెన్స్‌ను 10 రోజుల పాటు సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. రైతులను మోసం చేసే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు స్పష్టం చేశారు.ప్రజా సమస్యలపై సమాచారం అందించండిప్రజలకు సంబంధించిన సమస్యలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతి, రైతులు, కార్మికులు, సాధారణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అక్రమ వసూళ్లు, మోసాలు, అక్రమ వ్యాపారాలు వంటి అంశాలపై సమాచారం అందిస్తే ప్రజా ప్రశ్న పత్రికలో ప్రచురించేందుకు సిద్ధంగా ఉన్నామని సంపాదక వర్గం తెలిపింది. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే పత్రిక లక్ష్యమని పేర్కొంది. అవినీతి, అక్రమాలు లేదా ప్రజలను ఇబ్బందులకు గురిచేసే ఘటనలపై ఆధారాలతో కూడిన సమాచారం అందిస్తే పరిశీలించి వార్తగా ప్రచురిస్తామని తెలిపింది.సమాజంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు ప్రజలు నిర్భయంగా తమ ఫిర్యాదులు, సమస్యలు, అక్రమాల వివరాలను సంబంధిత ఆధారాలతో తెలియజేయాలని ప్రజా ప్రశ్న పత్రిక ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

# ఉద్యమకారుల భూ పోరాటం విజయవంతం చేయాలి - కొట్టాల యాదగిరి

- ఉద్యమకారుల భూపోరాటం పోస్టర్ ఆవిష్కరణ
- తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఉప్పల్ భగాయత్‌లో భారీ బహిరంగ సభ
- ఉద్యమకారులకు 250 గజాల భూమి, నెలకు రూ. 25 వేల పెన్షన్ ఇవ్వాలి
- అమరవీరుల కుటుంబాలకు రూ. కోటి ఆర్థిక సాయం ప్రకటించాలి

గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవితమ్మ పిలుపు మేరకు జూలై 2వ తేదీన హైదరాబాద్‌లోని ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించబోయే "ఉద్యమకారుల భూ పోరాట" బహిరంగ సభకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఉద్యమకారులు, అమరవీరుల కుటుంబాలు, పార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి పిలుపునిచ్చారు. గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి, ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్ భవాని వేముల, శివశంకర్ ప్రజాపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సిద్ధించి పుష్కర కాలం అవుతున్నా, గత ప్రభుత్వం గానీ, ప్రస్తుత ప్రభుత్వం గానీ ఉద్యమకారులను మోసపూరిత హామీలతో మభ్యపెడుతూనే ఉన్నాయని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమంలో ఉవ్వెత్తిన ఎగిసిన కెరటంలా నిలిచిన కవితమ్మకు ఉద్యమకారుల గోస, బాధలు పూర్తిగా తెలుసన్నారు. అందుకే తెలంగాణ రక్షణ సేన పార్టీ ప్రకటించిన రోజునే.. మొదటి అంశంగా ఉద్యమకారులకు న్యాయం చేస్తామని అక్క గర్వంగా ప్రకటించారని గుర్తుచేశారు. ఆ మొదటి ధ్యేయ సాధన కోసమే ఈ రోజు భూ పోరాటానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల భూమి దక్కి తీరాలని, సీనియర్ సిటిజన్లయిన ఉద్యమకారులకు నెలకు రూ. 25,000 పెన్షన్ అందించాలని, అమరవీరుల కుటుంబాలకు రూ. 1 కోటి ఆర్థిక సాయం ప్రకటించడంతో పాటు, వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలతో గద్దెనెక్కిందని, కనీసం తెలంగాణ ఉద్యమకారులకు ఐడీ కార్డులు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందని వారు విమర్శించారు. 'కేకే కమిటీ' పేరుతో కాలయాపన చేస్తూ ఉద్యమకారులను మోసం చేస్తున్నారని, అందుకే తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితమ్మ ఆధ్వర్యంలో ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సంజీవరెడ్డి, కవిత, మాజీ ఎంపీటీసీ, ఎడ్ల నర్సింలు,నాయకులు నరేందర్ రెడ్డి, రాజు, చందు, ప్రసాద్, నర్సింలు, నరేష్, హరి, తదితరులు పాల్గొన్నారు.



# ఫిట్నెస్ లేని లైన్ మెన్ లు

- విద్యుత్ స్తంభాలు ఎక్కలేక అసిస్టెంట్లను ఏర్పాటు చేసుకుంటున్న లైన్ మెన్ లు
- ప్రమాదవశాత్తు మరణిస్తే పట్టించుకోని అధికారులు
- అవగాహన లేక షాక్ తో మరణిస్తున్న నిరుద్యోగులు
- మృతుని బంధువులతో భేరసారాలతో మమ అనిపిస్తున్న అధికారులు
- ఇలాంటి కేసులు వెలుగులోకి వస్తున్నా పట్టించుకోని యాజమాన్యం
- చెట్ల కొమ్మలు నరుకుతుండగా విద్యుత్ షాక్ తగిలి కొర్ర జగ్రాం మృతి

**"విద్యుత్ విభాగంలో పనిచేసే వారు ప్రతిక్షణం ప్రమాదపు అంచులపై ప్రయా ణం చేస్తుం టారు. అందుకే విద్యుత్ ఉద్యోగుల వేతనాలు ఏ ప్రభుత్వ ఉద్యోగికి లేనంతంగా చెల్లిస్తు న్నారు. ఒక్కొక్క సీనియర్ లైన్మెన్, లైన్ ఇన్స్పెక్టర్ల వేతనాలే నెలకు రూ. లక్ష నుంచి రూ. రెండు లక్షలకు పైగా ఉండడం గమనార్హం. అంత పెద్ద ఎత్తున వేతనాలు తీసుకుంటున్న సదరు ఉద్యోగులు ఏ క్షణంలో ఎలాంటి పనినైనా చేయడానికి సిద్ధంగా ఉండాలి. అవసరమైతే అర్థరాత్రి విద్యుత్ స్తంభంపై ఎక్కి విద్యుత్ మరమ్మతు పనులు చేసి వినియోగదారులకు విద్యుత్ సరఫరాను పునరుద్దరించాల్సిన అవసరం ఉంది. కానీ ప్రస్తుతం విద్యుత్ విభాగంలో పనిచేస్తున్న లైన్ ఇన్స్పెక్టర్లలో 80శాతం మంది, లైన్ మెన్లలో 50శాతం మంది విధులు నిర్వహించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఫిట్నెస్ లేక విద్యుత్ స్తంభం ఎక్కలేని, దిగలేని పరిస్థితుల్లో వారికి మరో ప్రైవేట్ అసిస్టెంట్లను ఏర్పాటు చేసుకుంటున్న తీరు చర్చనీయాంశంగా మారుతుంది. అనుభవం లేని నిరుద్యోగ యువత ఆశతో వచ్చి కొన్ని సందర్భాలలో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కానీ వారికి ఇటు సంస్థ నుంచి కానీ, అటు వారిని ఏర్పాటు చేసుకున్న లైన్మెన్, లైన్ ఇన్స్పెక్టర్ల నుంచి ఎలాంటి సహకారం లేక వారి కుటుంబాలు రోడ్డున పడుతున్న తీరు బాధాకరం"**




మేడ్చల్( ప్రశ్న న్యూస్ ) విద్యుత్ విభాగంలో పనిచేసే వారు ప్రతి క్షణం ప్రమాదపు అంచులపై ప్రయాణం చేస్తుంటారు. అందుకే విద్యుత్ ఉద్యోగుల వేతనాలు ఏ ప్రభుత్వ ఉద్యోగికి లేనంతంగా చెల్లిస్తున్నారు. ఒక్కొక్క సీనియర్ లైన్మెన్, లైన్ ఇన్స్పెక్టర్ల వేతనాలే నెలకు రూ. లక్ష నుంచి రూ.రెండు లక్షలకు పైగా ఉండడం గమనార్హం. అంత పెద్ద ఎత్తున వేతనాలు తీసుకుంటున్న సదరు ఉద్యోగులు ఏ క్షణంలో ఎలాంటి పనినైనా చేయడానికి సిద్ధంగా ఉండాలి. అవసరమైతే అర్థరాత్రి విద్యుత్ స్తంభంపై ఎక్కి విద్యుత్ మరమ్మతు పనులు చేసి వినియోగదారులకు విద్యుత్ సరఫరాను పునరుద్దరించాల్సిన అవసరం ఉంది. కానీ ప్రస్తుతం విద్యుత్ విభాగంలో పనిచేస్తున్న లైన్ ఇన్స్పెక్టర్లలో 80శాతం మంది, లైన్మెన్లలో 50 శాతం మంది విధులు నిర్వహించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఫిట్నెస్ లేక విద్యుత్ స్తంభం ఎక్కలేని, దిగలేని పరిస్థితుల్లో వారికి మరో ప్రైవేట్ అసిస్టెంట్లను ఏర్పాటు చేసుకుంటున్న తీరు చర్చనీయాంశంగా మారుతుంది. అనుభవం లేని నిరుద్యోగ యువత ఆశతో వచ్చి కొన్ని సందర్భాలలో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కానీ వారికి ఇటు సంస్థనుంచి కానీ, అటు వారిని ఏర్పాటు చేసుకున్న లైన్మెన్, లైన్ ఇన్స్పెక్టర్ల నుంచి ఎలాంటి సహకారం లేక వారికి కుటుంబాలు రోడ్డున పడుతున్న తీరు బాధాకరం.

### విధి నిర్వహణలో ఫిట్గా లేని లైన్మెన్, లైన్ ఇన్స్పెక్టర్లు :

లైన్మెన్, లైన్ ఇన్స్పెక్టర్, ఆర్టిజన్, ఫార్మెన్లు అన్ఫిట్గా మారుతున్నారు. స్వయంగా స్తంభాలను ఎక్కి దిగలేకపోతున్నారు. వృద్ధాప్యం కారణంగా కొంతమంది ఎక్కిదిగలేకపోతుంటే.. రోజువారీ ప్రాక్టీస్ లేక మరికొంత మంది దూరంగా ఉంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అమాయక నిరుద్యోగులను అసిస్టెంట్లుగా నియమించుకుని గుట్టుగా వారితో సంస్థ పనులు చేయిస్తున్నారు. ప్రమాదవశాత్తూ కార్మికుడు మృతి చెందితే.. తీరా తమకేమి సంబంధం లేదని చెప్పి తప్పించుకుంటున్నారు. బుధవారం కండ్లకోయ నుంచి సాయిగీతాశ్రమం దారిలో విద్యుత్ శాఖ అధికారులు చెట్లకొమ్మలు కత్తిరించే సమయంలో నల్గొండ జిల్లా, నారాయణపూర్ మండలం చిల్లపురం గ్రామానికి చెందిన కొర్ర జగ్రాం(46) హై టెన్షన్ వైర్లు తగిలి కింద పడిపోయాడు. కండ్లకోయ సీఎంఆర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతోనే జగ్రాం మృతి చెందాడని తమకు న్యాయం చేయాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులు, మృతదేహాన్ని తరలించకుండ ఆసుపత్రి వద్ద అడ్డుకున్నారు. ఉన్నతాధికారులు, పోలీసులు చేరుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఇదిలా ఉండగా మేడ్చల్ సబ్ స్టేషన్, అత్వెల్లి సబ్ స్టేషన్, కిష్టాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో తరచూ ఇలాంటి ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. కొంత మంది అమాయకులు గాయాలపాలు కాగా మరికొంత మంది మృత్యువాతపడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కానీ ఇందుకు బాధ్యులైన ఎఈ, రెగ్యులర్ లైన్మెన్లపై ఇప్పటివరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కనీసం ఉన్నతాధికారుల పంచనామాలో వారి పేరు కూడా కనిపించడం లేదంటే ఆశ్చర్యపోనవసరం లేదు.

### నిజానికి ఇతర ప్రభుత్వ విభాగాల్లో పనిచేసే ఉద్యోగుల విధులతో పోలిస్తే...:

విద్యుత్ సంస్థల్లో విధి నిర్వహణ కొంత ప్రమాదకరం. రిస్క్ ఎక్కువ ఉంటుంది కాబట్టే ఎక్కడ లేనంత జీతం ఇక్కడి రెగ్యులర్ ఉద్యోగులకు వస్తుంది. అంతేకాదు వేతనంతో కూడిన సెలవులతో పాటు కార్పొరేట్ ఆస్పత్రుల్లో అన్లిమిటెడ్ వైద్యసేవలు పొందే అవకాశం, ఒకవేళ ప్రమాదవశాత్తూ విధి నిర్వహణలో షాక్ కు గురై చనిపోయినా, అంగవైఖల్యం బారినపడినా డిస్కం వారికి పెద్దమొత్తంలో నష్టపరిహారం చెల్లిస్తుంది. కుటుంబ సభ్యుల్లో ఒకరికి సంస్థలో ఉద్యోగ అవకాశంయి కూడా కల్పిస్తుంది. కానీ జేఎల్ఎంలకు అసిస్టెంట్లుగా, విలేజ్ హెల్పర్లుగా చెప్పుకుంటున్న వారికి ఎలాంటి బెన్ఫిట్స్ వర్తించవు. భవిష్యత్లో పర్మినెంట్ అవుతుందనే ఆశతో చాలా మంది నిరుద్యోగులు వీరి కింద అసిస్టెంట్లుగా పనిచేసేందుకు అంగీకరిస్తున్నారు. ప్రాణాలను



ఫణంగా పెట్టి పనిచేస్తున్నారు. ముఖ్యంగా మేడ్చల్ డివిజన్ల పరిధిలో పనిచేస్తున్న రెగ్యులర్ జేఎల్ఎంలు, లైన్ ఇన్స్పెక్టర్లు, ఆర్టిజన్లు, ఫోర్మెన్లు ఈ తరహా వ్యవహారాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ విభాగం సిబ్బంది పనితీరును పరిశీలించాల్సిన ఏఈ, ఏడీఈ, డీఈలు ఈ అంశాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు జోరుగానే వినిపిస్తున్నాయి. జూనియర్ లైన్మెను పోస్టింగ్ వచ్చిన కొత్తలో నెలవారి జీతం రూ. 40వేల వరకు ఉంటుంది. సీనియార్టీని బట్టి రూ. 1. 50లక్షలు పైగా తీసుకుంటున్నారు. నిజానికి వీరు ఉద్యోగంలో జాయిన్ అయిన తర్వాత వీరికి సెక్షన్ ఆఫీసులో పోల్ ఎక్కే విధానం లేకుండాపోయింది. మీటర్ రీడింగ్, డిస్




కనెక్షన్ (డిలిస్ట్) సర్వీసులకే పరిమితం అవుతున్నారు. మెజార్టీ ఫోర్మెన్లకు కనీసం కటింగ్ బ్లేడ్ పట్టడం కూడా ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ వర్కులు పూర్తిగా ప్రైవేటు కాంట్రాక్టర్లకు రావడం లేదు. రోజువారీ ప్రాక్టీస్ లేకపోవడంతో మెజార్టీ జేఎల్ఎంలు పోల్స్ ఎక్కడం మానేశారు. అవసరానికి మించి వేతనాలు ఉండటం కూడా విధి నిర్వహణలో నిర్లక్ష్యం పెరగడానికి మరో కారణం. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు వ్యక్తులతో పనిచేయిస్తున్నారు. సంస్థ ఉద్యోగులు చేయాల్సిన పనులకు రోజువారీ కూలీలతో చేయిస్తున్నారు. విద్యుత్ లైన్లు, సరఫరా వ్యవస్థపై వారికి సరైన అవగాహన లేక విద్యుత్ ప్రమాదానికి గురై మృత్యువాత పడుతున్నారు. ఎల్సీలు తీసుకున్నప్పటికీ ఇంట్లోని ఇన్వెర్టర్లు, జనరేటర్ల నుంచి లైన్కు రిటర్న్ కరెంట్ పాస్ అవుతోంది. ఈ విద్యుత్ ప్రమాదాలపై ఏడీఈ, డీఈ ఇచ్చే ఫిర్యాదు ఆధారంగానే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయాల్సి వస్తోంది. ప్రైవేటు కార్మికులతో పని చేయించినట్లు ధృవీకరిస్తే.. రెగ్యులర్ ఉద్యోగికి ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతో ఆ విషయాన్ని వారు దాచిపెట్టి మృతుల బంధువులతో బేరసారాలతో సరిపెడుతున్నారు. వీరంతా ఇతర ప్రాంతాల నుంచి పొట్ట చేతపట్టుకుని బతుకుదెరువు కోసం వచ్చిన వారుకావడంతో చేసేది లేక వారు కూడా ఇచ్చింది తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. ఈ విషయం యాజమాన్యానికి తెలిసి కూడా ఇప్పటి వరకు ఏ ఒక్కరిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

# తుంగా పాణం.. గంగా స్నానం


### - దక్షిణాది రాష్ట్రాల సరికొత్త ఐక్యత!

అమరావతి (ప్రశ్న న్యూస్) దక్షిణ భారతదేశానికి అన్నపూర్ణగా, మూడు రాష్ట్రాల లక్షలాది ఎకరాల ఆయకట్టుకు జీవనాడిగా నిలిచిన ప్రఖ్యాత తుంగభద్ర డ్యామ్ 73 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో ఒక అత్యంత అరుదైన, సువర్ణ ఘట్టం ఆవిష్కృతమైంది. కర్ణాటకలోని విజయనగర జిల్లా హోసపేట వేదికగా తుంగభద్ర ప్రాజెక్టుకు రూ. 51 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా పునర్నిర్మించిన 33 కొత్త స్పిల్ వే గేట్లను (క్రస్ట్ గేట్లు) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ఉమ్మడిగా ప్రారంభించారు. ఏపీ తరఫున మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్ కూడా ఈ చారిత్రాత్మక వేడుకలో పాల్గొన్నారు. గేట్ల ప్రారంభోత్సవం అనంతరం నేతలంతా హోసపేటలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు తరలివచ్చారు.

### - నాడు విపత్తు.. నేడు పునరుజ్జీవం

బహిరంగ సభలో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తన మార్క్ ప్రసంగంతో అందరినీ ఆకట్టుకున్నారు. "తుంగా పాణం.. గంగా స్నానం" అనే సామెతను గుర్తు చేస్తూ తుంగభద్ర నది పవిత్రతను కొనియాడారు. 2024 ఆగస్టులో వచ్చిన భారీ వరదలకు 19వ నంబర్ గేటు కొట్టుకుపోయినప్పుడు.. నిపుణుడు కన్నయ్య నాయుడు నేతృత్వంలో రికార్డు సమయంలో తాత్కాలిక 'స్టాప్‌లాక్' గేటును అమర్చి అపారమైన జల వృధాను అడ్డుకున్నామని గుర్తుచేశారు. ఆ తర్వాత ఏపీ, కర్ణాటక ప్రభుత్వాలు సంయుక్తంగా అత్యంత సమన్వయంతో పనిచేసి కేవలం 6 నెలల రికార్డు కాలంలోనే మొత్తం 33 క్రస్ట్ గేట్లను పునరుద్ధరించి, రైతుల ప్రయోజనాలను కాపాడామని హర్షం వ్యక్తం చేశారు. విజయనగర సామ్రాజ్యానికి, హంపీకి సహజ రక్షణ కవచంగా నిలిచిన ఈ నదీతీరానే జోగులాంబ, హంపీ విరూపాక్ష ఆలయం, మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం వంటి పుణ్యక్షేత్రాలు వెలిశాయని పేర్కొన్నారు.

### - ఒకే వేదికపై ముగ్గురు సీఎంలు.. ఇదొక చరిత్ర



గత చరిత్రను గుర్తుచేస్తూ 1983లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీతో పాటు నలుగురు దక్షిణాది ముఖ్యమంత్రులు కలిసి తమిళనాడుకు (చెన్నై తాగునీటి కోసం) 15 టీఎంసీల నీళ్లు ఇవ్వాలని చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని, మళ్లీ ఇన్నాళ్లకు కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ముగ్గురు ముఖ్యమంత్రులం ఒకే వేదికపైకి రావడం ఒక అద్భుతమైన మైలురాయి అని చంద్రబాబు అభివర్ణించారు. "రాష్ట్రాలుగా మనం వేరైనా దేశంగా మనమంతా ఒక్కటే" అని చాటిచెబుతూ, కేంద్ర మంత్రి నేతృత్వంలో తామంతా కలిసి ఈ ప్రాంత రైతుల ప్రయోజనాలపై సుదీర్ఘంగా చర్చించామని, దక్షిణాది రాష్ట్రాల చరిత్రలో ఈ సమావేశం నిలిచిపోతుందని స్పష్టం చేశారు.

### - నదుల అనుసంధానమే దేశానికి శ్రీరామరక్ష

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత్ 'వన్ నేషన్ - వన్ గ్రిడ్', టెలికాం, రహదారి నెట్‌వర్క్‌లతో అగ్రగామిగా దూసుకుపోతోందని, ఇప్పుడు జలవనరుల రంగంలోనూ విప్లవాత్మక మార్పులు రావాలని చంద్రబాబు ఆకాంక్షించారు. దేశంలో గంగా-కావేరి నదులను అనుసంధానిస్తే భారతదేశాన్ని ఆపడం ఎవరితరం కాదన్నారు. ఇప్పటికే ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో 'కెన్-బెత్వా' ప్రాజెక్టు ద్వారా నదుల అనుసంధానం విజయవంతమైందని అదే తరహాలో 'గోదావరి-కావేరి' నదులను అనుసంధానించడం ద్వారా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నీటి అవసరాలు శాశ్వతంగా తీరుతాయని రోడ్ మ్యాప్ వివరించారు.

### - ఈ ఏడాది నీటిని పొదుపుగా వాడుకుందాం

ప్రస్తుతం 'ఎల్ నినో' ప్రభావం కారణంగా తుంగభద్రకు, ఆల్మట్టికి ఎగువ నుంచి ఆశించిన స్థాయిలో నీటి ప్రవాహాలు రావడం లేదని చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది నీటిని అత్యంత పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందని రైతులకు పిలుపునిచ్చారు.

ఇలాంటి సంక్షోభాలను అధిగమించడానికే ముందుగా రాష్ట్రాల అంతర్గత నదులను, ఆ తర్వాత అంతర్రాష్ట్ర నదులను అనుసంధానం చేసుకోవాలనే ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. అందరం కలిసికట్టుగా ఉమ్మడి వ్యూహంతో ముందుకు సాగి, రైతాంగ ప్రయోజనాలను కాపాడుకుందామని సభాముఖంగా పిలుపునిచ్చారు.

## వీబీఆర్ కళాశాలలో ఘనంగా
# పోలీసుల అవగాహనా సదస్సు



**జూన్ 25 రేణిగుంట** :యువత సన్మార్గంలో నడిచి ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలనే సదుద్దేశంతో, గాజులమండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని వీబీఆర్ కళాశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం ఒక భారీ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 'ఈగల్' ఇన్‌స్పెక్టర్, గాజుల మన్యం సిఐ మంజునాథ్ ఎస్సై హరీష మరియు వారి పోలీసు బృందం పాల్గొని విద్యార్థులకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఈగల్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నివారణ యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని క్షణికావేశంలో వ్యసనాలకు బానిసలైతే జీవితాలు మరియు కెరీర్ నాశనమవుతాయని హెచ్చరించారు. కళాశాల పరిసరాల్లో ఎవరైనా మాదకద్రవ్యాలు విక్రయించినా, వినియోగించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈగల్ ఇన్స్పెక్టర్ మరియు గాజుల మన్యం సిఐ మంజునాథ్ ఎస్సై హరీష బి.వి.ఆర్ కళాశాల సిబ్బంది కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు...

## 6 నెలల ప్లానింగ్.. 2004 ఫోన్ కాల్స్,
# 238 గంటల టాక్ టైమ్..

### - వణుకు పుట్టిస్తున్న మర్డర్ స్కెచ్..

పూణేకు చెందిన ప్రముఖ రియల్టర్ కేతన్ అగర్వాల్ హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఎంతో అంగరంగ వైభవంగా నిశ్చితార్థం జరిగి, నవంబర్‌లో ఉదయ్‌పూర్ ప్యాలెస్‌లో పెళ్లికి సిద్ధమైన ఒక జంట కథ.. చివరకు ఓ ఘోరమైన హత్యోదంతంగా ముగిసింది. కేతన్ కాబోయే భార్య సియా గోయల్ (20), ఆమె ప్రియుడు చేతన్ చౌదరి (22) కలిసి అత్యంత కిరాతకంగా ఈ మర్డర్ ప్లాన్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. జూన్ 18న లోహగడ్ కోట లోయలోకి కేతన్‌ను తోసేసి, ప్రమాదవశాత్తు జరిగిందంటూ నమ్మించే ప్రయత్నం చేసిన ఈ ఇద్దరి కుట్రను పూణే రూరల్ పోలీసులు సాంకేతిక ఆధారాలతో చేధించారు. ఈ ఘోరానికి వెనుక ఆరు నెలల సుదీర్ఘమైన ప్లానింగ్ ఉందని దర్యాప్తులో తేలింది. సియా, చేతన్ ఇద్దరూ గత ఆరు నెలల్లో ఏకంగా 2,004 సార్లు ఫోన్లలో మాట్లాడుకున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ దాదాపు 238 గంటల పాటు ఫోన్ కాల్స్‌లో గడపడమే కాకుండా, కొన్ని సంభాషణలు ఏకధాటిగా మూడు గంటల కంటే ఎక్కువ సమయం సాగాయని పూణే రూరల్ ఎస్పీ సందీప్ సింగ్ గిల్ తెలిపారు. హత్య జరిగిన రోజు కూడా వీరిద్దరూ ముందుగా ఒక కేఫేలో కలుసుకుని, లోహగడ్ కోటలో ఏ పాయింట్ నుంచి కేతన్‌ను లోయలోకి తోసేయాలో పక్కాగా స్కెచ్ వేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరు నిందితులూ పోలీసుల కస్టడీలో ఉన్నారు.అయితే, కేతన్‌ను మట్టుబెట్టడానికి వారు జూన్ 18 కంటే ముందే మూడు సార్లు విఫలయత్నాలు చేసినట్లు విచారణలో తేలింది. మొదట జూన్ 6న బాలిలో జరగాల్సిన వీరి ప్రీ-వెడ్డింగ్ ఫోటోషూట్‌ను చెడగొట్టడానికి, ఖలాపూర్ సమీపంలోని ఫుడ్ మాల్‌లో కేతన్ పాస్‌పోర్ట్‌ను సియా దొంగిలించి మహిళల వాష్‌రూమ్‌లో పడేసింది. ఆ తర్వాత మే 31, జూన్ 4 తేదీల్లో కేతన్‌ను లోహగడ్ కోటకు తీసుకెళ్లాలని చూసినా, ఒకసారి కేతన్ తల్లి వారించడంతో ఆ ప్లాన్ సాగలేదు. చివరకు జూన్ 14న కోటకు తీసుకెళ్లి లోయలోకి నెట్టేయగా.. కేతన్ అదృష్టవశాత్తు ఒక పొదను పట్టుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. అప్పుడు కంగారుపడిన సియా, అక్కడ పాము రావడంతోనే నువ్వు జారిపడ్డావని, నిన్ను తానే కాపాడానని నమ్మబలికింది. అయినప్పటికీ వదలకుండా జూన్ 18న మళ్లీ అక్కడికే తీసుకెళ్లి అనుకున్న కార్యాన్ని ముగించారు

# పోలీస్ సిబ్బంది సంక్షేమానికి కృషి



**మంచిర్యాల:** రామగుండం పోలీస్ కమిషనరేట్ సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. వర్షాకాలంలో విధి నిర్వహణకు ఉపయోగపడే రెయిన్ కోట్లను ఆయన పంపిణీ చేశారు. ఎండనకా, వాననకా కష్టపడి పనిచేసే సిబ్బందికి అత్యవసర పరిస్థితుల్లో రెయిన్ కోట్లు ఎంతగానో ఉపయోగపడతాయని, వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

## ఎమ్మార్వో సుచరిత నివాసాల్లో
# మరోసారి ఏసీబీ సోదాలు

**హైదరాబాద్** మరోసారి శామీర్పేట్ ఎమ్మార్వో సుచరిత నివాసాల్లో మరోసారి ఏసీబీ సోదాలు జరిగాయి. గతంలో సుచరిత పై అక్రమాస్తుల కేసు ఏసీబీ నమోదు చేసింది. ప్రస్తుతం సుచరిత ఏసీబీ కేసులో జైల్లో ఉంది. మే 26న శామీర్పేట్ ఎంఆర్ఓ కార్యాలయంలో ఏసీబీ సోదాలు జరిగాయి. రైతుల నుండి 30 లక్షలు లంచం డిమాండ్ చేసిన సుచరిత, నాలా కన్వర్షన్ కోసం అడ్వాన్సా తన డ్రైవర్ ద్వారా రెండు లక్షల లంచం తీసుకుంటూ రెడ్యాండెడ్గా ఏసీబీకి పట్టుబడింది. ఆమెపై తాజాగా అక్రమాస్తుల కేసు ఏసీబీ నమోదు చేసింది. హైదరాబాదులోని ఎమ్మార్వో సుచరిత నివాసాలతో పాటు వారి బంధువుల నివాసాల్లో ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. .!

## స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి



**అమరావతి** ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మిని ప్రభుత్వం నియమించింది. శ్రీలక్ష్మి 1988 బ్యాచ్కు చెందిన ఐఏఎస్ అధికారిణి. ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మిని జీఏడీ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

### యూరియా విక్రయాలపై కట్టుదిట్టమైన నిఘా...

# దుకాణాల తనిఖీ

**- మండల వ్యవసాయ అధికారి : ప్రణీత**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలో టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి ప్రణీత, మండల ఎస్సై రమాకాంత్ కలిసి పలు ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. యూరియాను ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా బుక్ చేసుకున్న రైతులకు మాత్రమే విక్రయించాలని దుకాణదారులకు సూచించారు. గత యాసంగిలో 2,471 మంది రైతులు యాప్ ద్వారా 8,724 యూరియా బస్తాలను కొనుగోలు చేయగా, ఈ వానాకాలంలో ఇప్పటివరకు 1,032 మంది రైతులు 3,375 బస్తాలను బుక్ చేసుకున్నారు. రైతులు ప్లే స్టోర్ లేదా వ్యవసాయ శాఖ సిబ్బంది సహాయంతో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పంట వివరాలు నమోదు చేసి యూరియాను బుక్ చేసుకోవాలని అధికారులు తెలిపారు.ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు యాప్‌లో కొత్త స్టాక్ అందుబాటులో ఉంటుందని, ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు బుకింగ్ చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**- పొలాస నరేందర్**



వేములవాడ (ప్రశ్న న్యూస్) ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు తన పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని ఉత్తర తెలంగాణ జిల్లాల బీసీ సాధికారిత సంఘం ఇంచార్జీ పొలాస నరేందర్ కోరారు.రాష్ట్రంలో ప్రారంభమైన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ జూలై 24 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి, మరణించిన వారి పేర్ల తొలగింపు, ద్వంద్వ నమోదుల సవరణ, బోగస్ ఓట్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణ వంటి కార్యక్రమాలు చేపడతారని తెలిపారు.ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులులేకుండా ఉండేందుకు బీసీ సంఘాలు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచి బిఎల్ఓ లకు సహకరించాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును కాపాడుకునేలా ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని పొలాస నరేందర్ విజ్ఞప్తి చేశారు.

## చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలపై దృష్టి సారించాలి

**- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర కీలకం**

**- బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ : రమాకాంత్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోయినిపల్లి ఎస్సై రమాకాంత్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్సై రమాకాంత్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత జీవితాలను నాశనం చేయడంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతాయని అన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లు, చెడు స్నేహాలు, సామాజిక మాధ్యమాల ప్రభావానికి లోనుకాకుండా చదువుతో పాటు తమ ఉన్నత లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలని సూచించారు.డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక ఆరోగ్య సమస్యలు తలెత్తడమే కాకుండా నేరాలకు దారితీసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎక్కడైనా మాదకద్రవ్యాల విక్రయాలు లేదా అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

# హన్మాజీపేట ప్రభుత్వ పాఠశాలలో పోలీసుల డ్రగ్స్ వ్యతిరేక చైతన్య కార్యక్రమం

**- డ్రగ్స్ రహిత తెలంగాణ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలి- వేములవాడ డీఎస్పీ : శ్రీనివాసులు**






వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రూరల్ మండలం, హన్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం యాంటీ-డ్రగ్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో భారీ మానవహారం నిర్వహించి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు ప్రదర్శించిన సామాజిక నాటికలు, పోస్టర్ పెయింటింగ్స్ ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి విద్య, క్రమశిక్షణ, లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం, రవాణా, విక్రయాలపై ఎన్డీపీఎస్ చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే తెలంగాణ ఈగల్ ఫోర్స్ హెల్ప్‌లైన్ 8712671111 లేదా స్థానిక పోలీసులకు తెలియజేయాలని కోరారు. అనంతరం వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వెంకటరాజం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో డ్రగ్స్ నిర్మూలన కోసం అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో హన్మాజీపేట సర్పంచ్ జంకె మధు, ఉపసర్పంచ్ అవునూరి శంకరవ్వ- -శంకరయ్య, వేములవాడ రూరల్ మండల విద్యాధికారి కిషన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్ రావు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది రాజశేఖర్, సతీష్, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి పెద్దపీట...! సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం...!!

- కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవతో సీసీ రోడ్డు పనులు షురూ
- స్తంభంపల్లి సర్పంచ్ : బొంగాని అశోక్ గౌడ్
- రోడ్డు సమస్యకు తెర.. సీసీ రోడ్డు నిర్మాణంపై గ్రామస్తుల హర్షం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, స్తంభంపల్లి గ్రామంలో పాల కేంద్రం నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే మార్గంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మంజూరు చేసిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

చాలా కాలంగా దెబ్బతిన్న రహదారితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు పనులు ప్రారంభం కావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఎన్నో ఏళ్ల డిమాండ్ అయిన ఈ సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. రోడ్డు పూర్తయితే ప్రజలకు రాకపోకలు సులభతరం అవుతాయని, గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు గ్రామ పంచాయతీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అక్కెనపల్లి ఉపేందర్, ఉపసర్పంచ్ చంద్రగిరి అశోక్, వార్డు సభ్యులు ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, చంద్రగిరి వెంకటేష్, వివిధ సంఘాల నాయకులు ఎర్రం మల్లారెడ్డి, నోముల రాజిరెడ్డి, కొడూరి శంకరయ్య, చిలుముల రమేష్, కందాడి కిరణ్ రెడ్డి,రాచర్ల రాజేశం, ముచ్చ రవీందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి,మహిపాల్ రెడ్డి,ముచ్చ మధుకర్ రెడ్డి, ముచ్చ రాజిరెడ్డి,లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితాల సవరణ కార్యక్రమం లో (ఎస్ఐఆర్-2026) పూర్తి వివరాలు సేకరించాలి

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) నర్సాపూర్ మున్సిపాలిటీ , నర్సాపూర్ మండలంలోని అచ్చంపేట గ్రామంలో సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో ఆర్డీవో తాహసిల్దార్ తో కలిసి జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ. బూత్ స్థాయి అధికారులకు కార్యక్రమం నిర్వహణపై పలు సూచనలు చేయడం జరిగిందన్నారు.. ఎన్యుమరేషన్ ఫారాలు అందజేయడం, తిరిగి సేకరించడం, వివరాల నమోదు అంశాలలో జాగ్రత్త వహించాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్య బాధ్యత అని పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ద్వారా ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందిస్తున్నామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి ఓటరుగా నమోదు కావాలని, చిరునామా మార్పులు, పేరు సవరణలు, ఇతర వివరాల నవీకరణ కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటరు జాబితా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. నేటి నుంచి బూత్ లెవల్ అధికారులు బి ఎల్ వో లు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని, ప్రజలుసరైన వివరాలను అందించాలన్నారుఈ కార్యక్రమంలో నర్సాపూర్ తాసిల్దార్ శ్రీనివాస్, బిఎల్వోలు, సర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ వెంకటాపూర్‌లో పీజీసీఆర్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**వెంకటాపూర్ కేజీబీవీలో తాత్కాలిక ఉద్యోగాలు, ఇంటర్ వరకు అడ్మిషన్లు షురూ**

**ములుగు జిల్లా బాలికలకు సువర్ణావకాశం: కేజీబీవీలో ఉద్యోగాలు, సీట్లు ఖాళీ**

ములుగు( ప్రశ్న న్యూస్)ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఖాళీగా ఉన్న తాత్కాలిక పోస్టులను భర్తీ చేయనున్నట్లు స్పెషల్ ఆఫీసర్ శ్రీమతి శిరీష ఒక ప్రకటనలో తెలిపారు.పీజీసీఆర్టీ ఎకనామిక్స్-1, పీజీసీఆర్టీ నర్సింగ్-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు. స్థానికులై, అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో ఈనెల 25 నుంచి 29వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు కేజీబీవీ వెంకటాపూర్‌లో స్పెషల్ ఆఫీసర్‌కు వ్యక్తిగతంగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు 6304594951 నంబర్‌లో స్పెషల్ ఆఫీసర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.అదేవిధంగా విద్యాలయంలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఖాళీగా ఉన్న సీట్ల వివరాలు ఇలా ఉన్నాయి: 6వ తరగతి-20, 7వ తరగతి-10, 8వ తరగతి-10, 9వ తరగతి-7, ఇంటర్ మొదటి సంవత్సరం వీూనఔ(ఖీ)-34, ఇంటర్ మొదటి సంవత్సరం జజుజ-33. అర్హత కలిగిన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని యాజమాన్యం కోరింది.



# మాంసం దుకాణాల్లో ఈగల మోత

## జాడే లేని పర్యవేక్షణ

- పరిశుభ్రత ప్రమాణాలు పాటించని మాంస విక్రయదారులు
- జాడే లేని జీఎచ్ఎంసి, ఆహార భద్రతాధికారుల పర్యవేక్షణ
- కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల ముప్పు పెరుగుతుంది.
- ఈగలు వాలుతు బహిరంగ ప్రదేశాల్లో విక్రయించే మాంసాన్ని కొనవద్దు.
- ఉప్పు పసుపుతో బాగా కడిగిన తర్వాత అధిక వండిన మాంసాన్ని మాత్రమే తీసుకోవాలి.
- ప్రజల ఆరోగ్యానికి సవాలుగా మారిన ఈగల మోత
- జీఎచ్ఎంసి, ఆరోగ్యం భద్రతాధికారులు స్పందించి వెంటనే క్షేత్రస్థాయిలో మాంసం దుకాణాలను తనిఖీ చేయాలి.
- పరిశుభ్రత ప్రమాణాలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు అధికమవడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా కలుషిత నీరు తాగడం, కలుషిత ఆహర పదార్థాలను తీసుకోవడం వల్ల డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల ముప్పు పొంచి ఉంది. ముఖ్యంగా మాంస విక్రయ దుకాణాలలో (మటన్, చికెన్ దుకాణాలు) ఈగలు ఎక్కువగా వాలడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. మాంసం దుకాణాల్లోని వ్యర్థాలపై ఈగలు వాలి, ఆ తర్వాత మాంసంపై కూర్చోవడం వల్ల కలరా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయని వైద్యులు తెలిపారు. కాని మాంసం విక్రయదారులు మాత్రం సమస్యను అరికట్టడంల్లో పూర్తిగా నిర్లక్ష్యం వహించడం, సంబంధిత అధికారుల అలసత్వంతో ఆరోగ్య సమస్యలు తీవ్ర రూపం దాల్చే ప్రమాదం పొంచి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి మాంసం, చికెన్ విక్రయించే దుకాణాలల్లో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. సరైన పరిశుభ్రత ప్రమాణాలు పాటించక పోవడం తో ఈగల మోత మోగుతుంది. అయితే మాంసం, చికెన్ షాపుల్లో పరిశుభ్రత ప్రమాణాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంతో మాంసం విక్రయదారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మాంసం, చికెన్ దుకాణాల్లో మాంసాన్ని బహిరంగంగా ఉంచకుండా, విధిగా దోమల తెరలు లేదా ఐరన్ మెష్ (జాలీ) ఉన్న క్యాబినెట్లలో ఉంచాలి. షాపు ప్రవేశ ద్వారం వద్ద ఎయిర్ కర్టెన్ మెషీన్లను ఏర్పాటు చేయడం ద్వారా ఈగలు లోపలికి రాకుండా జాగ్రత్త పడవచ్చు. అలాగే షాపు లోపల ఎలక్ట్రానిక్ ఫ్లై కిల్లర్ (ఈగలను ఆకర్షించి చంపే మిషన్లు) లేదా జిగురు ప్యాడ్‌లను అమర్చి ఈగల వ్యాప్తిని నివారించవచ్చు. ఇక మాంసం విక్రయించే సమయంలో మిగిలే వ్యర్థాలను (బోన్స్, స్కిన్ ఇతర వ్యర్థాలు) వెంటనే మూత ఉన్న డస్ట్‌బిన్లలో వేస్తు వాటిని రోజు జనసంచారం లేని ప్రాంతంలో పారవేయాలి. అలాగే మాంసం కట్ చేసే టేబుల్, మొద్దు, కత్తులు, తూకంవేసే యంత్రాలను విధిగా రోజూ పొటాషియం పర్మాంగనేట్ లేదా ఇతర డిసిన్ఫెక్టెంట్లతో శుభ్రం చేయాల్సి ఉండగా ఎక్కడ కూడా ఈ జాగ్రత్తల పాటిస్తున్న జాడే లేదు. అసలే వర్షాకాలం, ముంచుకొస్తున్న అంటువ్యాధుల ప్రభావం ఈ పరిస్థితుల్లో జీఎచ్ఎంసీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం ఆందోళన కలిగించే విషయం. నగరంలో మాంస విక్రయ కేంద్రాల్లో ఈగల మోత మోగుతున్న పర్యవేక్షణ సిబ్బంది జాడే లేకపోవడం గమనార్హం.

ఇక మాంసం కొనుగోలు చేసే సమయంలో వినియోగదారులు తగు జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాల్లో ఉంచి విక్రయించే మాంసం, చికెన్ తో పాటు ఇతర తినుబండారాలను కొనద్దని, ఇక ఈగలు వాలుతు, తెరిచి ఉంచిన మాంసాన్ని అస్సలు కొనవద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కొనుగోలు చేసిన మాంసాన్ని వండే ముందు ఉప్పు, పసుపుతో బాగా కడిగిన తర్వాత అధిక ఉష్ణోగ్రత వద్ద బాగా ఉడికించిన తర్వాత తినాలని సూచిస్తున్నారు. అలాగే జీఎచ్ఎంసి అధికారులు, ఆహర భద్రతాధికారులు వెంటనే స్పందించి నిబంధనలు పరిశుభ్రత ప్రమాణాలు పాటించని షాపులను గుర్తించి వెంటనే చట్టపరమైన చర్యలు చేపట్టి అంటు రోగాల బారినుండి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా వుంది

# ఔటర్ రింగ్ దెబ్బకు 'హరిత' వెలవెల

**- కోట్ల ప్రభుత్వ ఆస్తి బీడుబాట - ఒకప్పుడు వీఐపీల సందడి... నేడు నిర్మానుష్యం**
**- ప్రజ్ఞాపూర్‌ను దాటేస్తున్న వాహనాలు - మూలపడిన పర్యాటక శాఖ హరిత**
**- ప్రైవేటుకు అప్పగింతతో మళ్లీ ఊపిరి పోసే ప్రయత్నం**




**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్)** ఒకప్పుడు హైదరాబాద్, కరీంనగర్ ప్రధాన రహదారిపై ప్రయాణికుల రద్దీతో కళకళలాడిన ప్రజ్ఞాపూర్ హరిత రెస్టారెంట్ నేడు వెలవెలబోతోంది. కోట్ల రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ పర్యాటక శాఖ ఆస్తి ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై నిర్మానుష్యంగా మారడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి గీతారెడ్డి చొరవతో నిర్మించిన హరిత రెస్టారెంట్ కొన్నేళ్ల పాటు ప్రయాణికులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, మంత్రులు, ఎమ్మెల్యేలకు ముఖ్య విశ్రాంతి కేంద్రంగా నిలిచింది. నాణ్యమైన భోజనం, విశాలమైన పార్కింగ్, ఆధునిక వసతులతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ఒక దశలో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్లే దాదాపు ప్రతి వాహనం ప్రజ్ఞాపూర్ వద్ద ఆగేదంటే అతిశయోక్తి కాదు. హరిత చుట్టూ చిన్న వ్యాపారాలు, హోటళ్లు, వాణిజ్య కార్యకలాపాలు కూడా ఊపందుకున్నాయి.

### ఔటర్ రింగ్‌తో మారిన పరిస్థితి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో ఔటర్ రింగ్ రోడ్డు అందుబాటులోకి రావడంతో రవాణా మార్గాలు పూర్తిగా మారిపోయాయి. కరీంనగర్, హైదరాబాద్ మధ్య ప్రయాణించే వాహనాలు ప్రజ్ఞాపూర్‌కు రాకుండానే నేరుగా గమ్యస్థానాలకు చేరుకుంటున్నాయి. దీంతో హరిత రెస్టారెంట్‌కు వచ్చే సందర్శకుల సంఖ్య క్రమంగా తగ్గిపోయి, వ్యాపారం పూర్తిగా దెబ్బతింది.

ఒకప్పుడు రాజకీయ ప్రముఖుల సందడితో కళకళలాడిన ప్రాంగణం నేడు నిశ్శబ్దానికి చిరునామాగా మారింది. నిర్వహణ లేక భవనాలు, పరిసరాలు క్రమంగా శిథిలావస్థకు చేరుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### కోట్ల ఆస్తికి కొత్త జీవం.?

ప్రజాధనంతో నిర్మించిన ఆస్తులు నిరుపయోగంగా మారకుండా వాటిని తిరిగి ఆదాయ వనరులుగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. అందులో భాగంగా ప్రజ్ఞాపూర్ హరిత రెస్టారెంట్‌ను అద్దె ప్రాతిపదికన ప్రైవేట్ నిర్వాహకులకు అప్పగించినట్లు సమాచారం.

ప్రస్తుతం అక్కడ బార్ అండ్ రెస్టారెంట్ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలిసింది.

### అభివృద్ధికి కృషి చేయండి స్థానికుల విన్నపం..

ప్రభుత్వ ఆస్తులను కాపాడుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఒకప్పుడు వేలాది మంది ప్రయాణికులకు మజిలీగా నిలిచిన హరిత రెస్టారెంట్‌కు మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలని, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేస్తున్నారు. "ఒకప్పుడు ప్రయాణికుల రద్దీతో కళకళలాడిన హరిత, నేడు ఔటర్ రింగ్ ప్రభావంతో వెలవెలబోతోంది. కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తికి మళ్లీ పూర్వ వైభవం వస్తుందా.?" అనే ప్రశ్న స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

### భారత్‌కు లాభం ఉంటేనే

# అమెరికాతో ట్రేడ్ డీల్

**- అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై గోయల్ కీలక వ్యాఖ్యలు**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందంపై కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇతర దేశాల కంటే భారతీయ ఉత్పత్తులకు ప్రత్యేక ప్రయోజనం లభించని పక్షంలో అగ్రరాజ్యంతో ఎలాంటి ఒప్పందంపై సంతకం చేయబోమని స్పష్టం చేశారు. లండన్ పర్యటనలో మాట్లాడిన ఆయన భారత ఎగుమతిదారులకు అమెరికా మార్కెట్లో ప్రత్యేక అవకాశాలు కల్పించేలా చట్టపరమైన, విధానపరమైన వ్యవస్థను అమెరికా రూపొందించాల్సి ఉందన్నారు. ఆ అంశం ఖరారయ్యే వరకు ఒప్పందం కుదరదని తేల్చిచెప్పారు. భారత్–అమెరికా మధ్య జరుగుతున్న చర్చల్లో దిగుమతి సుంకాల తగ్గింపు కీలక అంశంగా మారింది. గతంలో భారత ఉత్పత్తులపై దాదాపు 50 శాతం వరకు ఉన్న సుంకాలను 18 శాతానికి తగ్గించే ప్రతిపాదన ఆధారంగా చర్చలు సాగాయని గోయల్ వెల్లడించారు. అలా జరిగితే భారత ఉత్పత్తులకు ఇతర దేశాల కంటే అమెరికా మార్కెట్లో ప్రయోజనం లభిస్తుందని పేర్కొన్నారు. అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్‌తో ఇటీవల ఢిల్లీలో జరిగిన చర్చల అనంతరం కూడా ఇరు దేశాలు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించేందుకు కట్టుబడి ఉన్నాయని కేంద్ర వాణిజ్య శాఖ తెలిపింది. అయితే పెండింగ్‌లో ఉన్న కీలక అంశాలపై ఇంకా తుది నిర్ణయం రాలేదు. ఈ ఏడాది ప్రారంభంలో మధ్యంతర వాణిజ్య ఒప్పందం దిశగా చర్చలు మొదలైనప్పటి నుంచి ఇది మూడో విడత చర్చలు కావడం విశేషం.

# ప్రధాని మోదీతో అమెజాన్ సీఈఓ భేటీ

**- భారత్‌లో రూ.లక్షల కోట్ల పెట్టుబడి ప్రకటన**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ప్రముఖ ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్, భారత్‌లో తన వ్యాపార కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోదీతో కంపెనీ సీఈఓ ఆండీ జెస్సీ సమావేశమైన అనంతరం ఈ కీలక ప్రకటన వెలువడింది. 2026 నుంచి 2030 మధ్య కాలంలో దేశంలో ఏకంగా 48 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 4.53 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు అమెజాన్ ప్రకటించింది. ఈ పెట్టుబడులతో భారత మార్కెట్‌పై తమకున్న దీర్ఘకాలిక నిబద్ధతను కంపెనీ మరోసారి స్పష్టం చేసింది. భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను విస్తరించడానికి 2030 నాటికి అదనంగా 13 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఆండీ జెస్సీ తెలిపారు. దీంతో కేవలం ఏఐ, క్లౌడ్ రంగంలోనే అమెజాన్ మొత్తం పెట్టుబడి 21 బిలియన్ డాలర్లను దాటనుంది. ఈ పెట్టుబడుల ద్వారా ముంబై, హైదరాబాద్‌లలోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) డేటా సెంటర్ల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నారు. ఇది స్టార్టప్‌లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలకు కస్టమ్ ఏఐ చిప్స్, సురక్షిత క్లౌడ్ టెక్నాలజీలు, డెవలపర్ టూల్స్‌ను అందుబాటులోకి తెస్తుంది. తద్వారా ఆవిష్కరణలను వేగవంతం చేయవచ్చని కంపెనీ పేర్కొంది. ఈ సమావేశం అనంతరం ఆండీ జెస్సీ మాట్లాడుతూ.. "దశాబ్దం క్రితం భారత్‌లోకి అడుగుపెట్టాం. అప్పటి నుంచి ఈ–కామర్స్, ఏఐ, క్లౌడ్ వ్యాపారాల్లో అద్భుతమైన వృద్ధిని చూస్తున్నాం. ప్రధాని మోదీ దార్శనికత అయిన 'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాల సాధనకు కట్టుబడి ఉన్నాం. భారత్ వృద్ధి ప్రస్థానంలో దీర్ఘకాలిక భాగస్వామిగా కొనసాగుతాం" అని స్పష్టం చేశారు. ఈ కొత్త పెట్టుబడులతో కలిపి 2010 నుంచి 2030 వరకు భారత్‌లో అమెజాన్ పెట్టిన మొత్తం పెట్టుబడుల విలువ 88 బిలియన్ డాలర్లకు పైగా చేరుకుంటుంది.

# అయోధ్య రామమందిరంలో నిధుల గోల్‌మాల్

**- 8 మందిపై కేసు, ఆరుగురు అరెస్ట్!**



**అయోధ్య (ప్రశ్న న్యూస్)** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం కేసులో ఉత్తరప్రదేశ్ పోలీసులు ఎనిమిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అందజేసిన ఫిర్యాదు మేరకు గురువారం రామ్ జన్మభూమి పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. ట్రస్ట్ సభ్యుడు కృష్ణ మోహన్ ఫిర్యాదు ప్రకారం, ఆలయం విరాళాల పెట్టెల్లోని నగదును లెక్కించే సిబ్బంది కుట్రపూరితంగా నిధులను పక్కదారి పట్టించారు. సీసీటీవీ దృశ్యాలను పరిశీలించడంతో ఈ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. నిందితుల్లో ఆలయ ఉద్యోగులైన అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా, అవినాశ్ శుక్లా తదితరులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు రూ. 7 కోట్ల నుంచి రూ. 7.5 కోట్ల మేర నిధులు అవకతవకలు జరిగినట్లు తెలుస్తోంది. నిందితుల నుంచి పోలీసులు కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. విరాళాల నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో, ఆలయ ట్రస్ట్ విజ్ఞప్తి మేరకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేసింది. ఈ బృందం ఇటీవలే ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు తన ప్రాథమిక నివేదికను సమర్పించింది. ఆ నివేదికలోని ముఖ్యాంశాల ఆధారంగానే పోలీసులు తాజా చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ, భక్తుల నమ్మకాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం మహా పాపమని విమర్శించారు. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి ఇతర విపక్షాలు ఈ కేసుపై పారదర్శక విచారణ జరపాలని, అవసరమైతే సీబీఐ దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే, దర్యాప్తు ప్రక్రియ కొనసాగుతున్నందున రాజకీయ నాయకులు అనవసర వ్యాఖ్యలు చేయవద్దని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ విజ్ఞప్తి చేశారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588